హనీబీఎపి

ఏప్రిల్ - జూన్ 2008

# పల్లెసృజన

సంపుటి 2,  సంచిక 4

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక





# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాం క్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు :

✤ 74 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ నలుగురు ఇన్నోవేటర్లను అహమ్మదా బాద్ లో జరిగిన జాతీయ సెమినార్‌కు పంపడం జరిగింది. వారికి లభించిన ఆదరణ, గౌరవం, సత్కారం తెలుగు ప్రజలకే గర్వకారణం.

✤ వందలాది తెలుగు ప్రజలతో టెలిఫోన్ ద్వారా హనీబీ గురించి చర్చించడం, వారికి తెలియజేయడం.

✤ గ్రామ ప్రజల సృజనాత్మక ఆవిష్కరణల పై రీసెర్చ్ చేస్తున్న వారికి సహకరించడం.

✤ గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణ లను, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 5వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి వందకు పైగా ఎంట్రీలు పంప బడ్డాయి.

✤ గ్రామీణ ఇన్నోవేటర్లకు ఉచిత సాంకేతిక మార్గదర్శకత్వానికి ముందుకు వచ్చిన ఎన్.ఐ.టి. వరంగల్‌తో సంధానం ద్వారా అయిదుగు ఇన్నోవేటర్లకు లాభం చేకూరింది.

✤ పారిశ్రామికవేత్తలు, అనధికార సంస్థలు, హనీబీ మూల పురుషుడు శ్రీ అనిల్ గుప్తా గారి సమక్షంలో 12 మంది తెలుగు ఇన్నోవేటర్లు ఆవిష్కరణలను ప్రదర్శించారు.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.

✤ నిజామాబాద్ ప్రాంతంలో మినీ శోధయాత్ర నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను వెలికి తీయడం జరిగింది.

✤ ఇప్పటి వరకు 7 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.

✤ టి.ఇ.పి.పి. ఛైర్మన్, డా. ఎ.ఎస్. రావు గారితో 16 మంది ఇన్నోవేటర్లతో ముఖాముఖి ఏర్పాటు చేయడం జరిగింది.

✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.

✤ హైదరాబాద్‌లో జనవరి 2008 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో 8 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.

✤ జనవరి 2008లో విశాఖలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ముగ్గురు ఇన్నోవేటర్లు పాల్గొని ప్రశంసలు పొందారు.

✤ ఫిబ్రవరి 2008లో మహబూబ్ నగర్ జిల్లా ఉత్తనూరు గ్రామంలో జరిగిన వ్యవసాయ ప్రదర్శనలో సంప్రదాయ జ్ఞానం, తమ అన్వేషణలను ఇన్నోవేటర్లు రైతులతో పంచుకున్నారు.

✤ మ్యాట్రిక్స్ అగ్రిసెక్షన్ సంస్థలో ఇద్దరు ఆవిష్కర్తల హెర్బల్ మందులను మార్కెట్ చేయటానికి ఒప్పందం కుదిరింది.

✤ ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయలో శోధయాత్రను జనవరిలో నిర్వహించి, స్థానిక జ్ఞానాన్ని సేకరించడం జరిగింది.

✤ ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో 'యస్.సి.ఎ.ఐ.' క్లబ్‌ను ప్రారంభించి, ఇన్నోవేటర్లకు ఉచితంగా సలహాలు, సహకారాలను అందించడం జరుగు తోంది.

✤ సెప్టెంబర్ నెలలో అహమ్మదా బాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఇద్దరు హనీబీఏపి కార్యకర్తలు 'స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్ వర్క్‌షాప్'లో పాల్గొనడం జరిగింది.

**మా కలలు :**

✤ ఆరవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించాలని.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో–ఆర్డినేటర్, హనీబీఏపి,

# పల్లెసృజన

సంపుటి-2 సంచిక - 4 ఏప్రిల్ - జూన్ 2008

**సంపాదకవర్గం**

సంపాదకులు :
**డా. కె.ఎల్. రావు**

ఉప సంపాదకులు :
**శ్రీమతి అరుణ గణేశం**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**డా. వై.వి. రావ్**
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040-30627739
సెల్ : 93913 75655, 92468 20655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన -శ్రీమతి పి. అరుణ
102, వాయుపురి, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com

## ఈ సంచికలో...

☞ పల్లె సంప్రదాయ జ్ఞానం : మెట్టు లక్ష్మి అపూర్వ సేకరణ 3
☞ సులువుగా చీపుర్ల తయారీ 7
☞ సేంద్రియ క్రిమి సంహారిణి 'సైన్స్రీ" 8
☞ టైర్లకు గాలికొట్టు అతి చిన్న మొబైల్ పంపు 9
☞ ఇద్దరు మిత్రుల కుర్ర 'కారు' 11
☞ పసుపు పంటకు సేంద్రియ రక్షణ 12
☞ పశువులకు కూడా 'ఎనిమా' 13
☞ ఇతర రాష్ట్రాల పల్లె ఇన్నోవేషన్లు 16
☞ స్టీరింగ్ లేని ట్రాక్టర్ 16
☞ విశాఖ జిల్లాలో 21వ శోధయాత్ర విశేషాలు 19
☞ నేను శోధించిన శోధయాత్ర 22
☞ స్పందన 27

**కవర్ లోపలి పేజీల్లో :**

హనీబీఏపి ప్రగతి
విశాఖ జిల్లా అరకు లోయలో జరిగిన శోధయాత్రలో
సత్కరింపబడిన పల్లె జ్ఞానవేత్తలు

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by : Dr. K.L. Rao, on behalf of "HoneyBeeAP" 102, Vayupuri, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 30627739.

# సంపాదకీయం

మీ 'పల్లెసృజన' ముచ్చటగా మూడవ ఏట అడుగు పెట్టింది. పాఠకులు, ఇన్నోవేటర్లు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, శ్రేయోభిలాషులు, హనీబీఏపి స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో ఈ త్రైమాసిక పత్రిక ప్రయాణం సాగిస్తున్నది. జ్ఞానవేత్తల ఆశీర్వచనాలు, పాఠకుల అభిమానం, ఇన్నోవేటర్ల ఉత్సాహం అన్నీ కలిసి సంపాదక వర్గానికి అన్ని విధాల సహకారం అందిస్తున్నాయి. అందరికీ సాదర అభివందనాలు.

స్వచ్ఛమైన పల్లెజ్ఞానాన్ని పదిమందికి పంచాలన్న ధ్యేయంతో ప్రారంభించిన ఈ చిన్న ప్రయత్నం ప్రవర్ధిల్లాలంటే, మీరూ భాగస్వాములు కావాలి. ప్రచురణకు మీరు పల్లెజ్ఞాన సంబంధిత రచనలను పంపవచ్చు. పల్లెసృజనపై మీ సద్విమర్శలు, సలహాలు, ఉత్తరాల రూపంలో పంపిస్తే వాటిని ప్రచురిస్తాం. పల్లెసృజనకు చందాదారుల సంఖ్యను పెంచడానికి తోడ్పడవచ్చు. మీ ఆఫీసు, స్కూలు, గ్రామం, ఫ్యాక్టరీల లైబ్రరీలను 'పల్లెసృజన' చందాదారులుగా చేయవచ్చు. మా ఈ ప్రయత్నంలో ఏ విధంగానైనా సహకరిస్తారని మనసారా విశ్వసిస్తున్నాం.

జ్ఞానం అనంతం. పల్లెవాసులకు ధనలోపం ఉండవచ్చు, ఆధునిక సౌకర్యాలు ఉండకపోవచ్చు, కాని వారి జ్ఞానధనం అపారం. ఈ సత్యాన్ని సవినయంగా విశ్వసిస్తూ, పల్లె జ్ఞానధనాన్ని వెలికి తీయడానికి చేస్తున్న ఈ ఉద్యమంలో ఎంతో చేయాల్సి వుంది. విద్యార్థులను ప్రోత్సహించడానికి 'యస్.సి.ఎ.ఐ.' క్లబ్‌లను ఏడు కళాశాలల్లో ప్రారంభించడం జరిగింది. వీరు గ్రామాల్లోకి పోయి జ్ఞానకర్తలను వెతికి, వెలికితీసి, జ్ఞాన సంపద వివరాలు సేకరించి వ్రాత రూపకంగా 'హనీబీఏపి' కి పంపడమే ఈ క్లబ్‌ల ముఖ్య ఉద్దేశ్యం. సింగరేణి మహిళా కళాశాల విద్యార్థుల స్వచ్ఛంద సేవ ఎంతో గణనీయం. కుమారి మెట్టు లక్ష్మిరెడ్డి 112 సంప్రదాయ పద్ధతులను సేకరించి, మాకు పంపింది. వాటిలో కొన్ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. ఇదే ప్రేరణతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేస్తారని ఆశిస్తున్నాము.

'మరుగున పడిన జ్ఞాన మందిరాలు మన పల్లెలు - ఈ మందిరాల సందర్శన తీర్థయాత్రే శోధయాత్ర' అంటారు ప్రొఫెసర్ అనిల్‌గుప్తా. వీటిని కాలినడకన దర్శించి, పల్లె ప్రజలకు ప్రకృతితో వున్న సామరస్యాన్ని అర్థం చేసుకొని వారి సంప్రదాయ జ్ఞానాన్ని సముపార్జన చేయడం, క్రియాశీలత్వాన్ని గ్రహించడం శోధయాత్ర ముఖ్య ఉద్దేశ్యం. ఈ సంవత్సరం జూన్ మొదటి వారంలో విశాఖ జిల్లాలోని అరకు లోయలో జరిపిన 21వ శోధయాత్ర వివరాలు ఈ సంచికలో మీ ముందుంచాము. పాఠకులు ఆనందిస్తారని ఆశిస్తున్నాము.

భవదీయ

**కె.ఎల్. రావు**

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం. -సంపాదకవర్గం

# పల్లె సంప్రదాయ జ్ఞానం: మెట్టు లక్ష్మి అపూర్వ సేకరణ




కుమారి **మెట్టు లక్ష్మి రెడ్డి,**
మహిళా కళాశాల, కొత్తగూడెం.

నాపేరు మెట్టు లక్ష్మి రెడ్డి, నేను సింగరేణి మహిళా కళాశాల, కొత్తగూడెంలో బి.యస్‌సి (బి.జడ్.సి.) చదువుతున్నాను. బయాలజి విద్యార్థినిగా నాకు ప్రకృతి అంటే ఎంతో ఇష్టం. ఈ భూమిమీద మానవ మనుగడకు కావలసిన ప్రాథమిక అవసరాలు అయిన ఆహారం, వస్త్రాలు, ఆవాసం, ప్రాణ వాయువు, మనల్ని వ్యాధుల బారినుండి రక్షించే ఔషధాలు మొదలగునవి ఎన్నో విలువైన పదార్థాలను మొక్కలు ఇస్తున్నాయి. మానవ జీవితానికి మొక్కలకు అవినాభావ సంబంధం ఉంది. ఇటీవలి కాలంలో ఔషధ వృక్ష శాస్త్రం చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది.

హనీబీఏపి చేపట్టిన స్కౌటింగ్ ద్వారా ఈ సాంప్రదాయ విజ్ఞానాన్ని వెలికి తీసి అందరికీ అందుబాటులోకి వచ్చేలా చేస్తున్న పని గూర్చి తెలుసుకుని నేను కూడా ఇందులో పాలు పంచుకోవాలి అనుకున్నాను. నేను సుమారు 110 మొక్కల ఔషధాల విలువలను గూర్చి సమాచారాన్ని సేకరించి బ్రిగేడియర్ గణేశం గారికి పంపించడం జరిగింది. దానికిగాను నాకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

నేను వీటిని తెలుసుకుని పల్లెసృజనకు పంపుటకు నాకు ప్రోత్సాహం ఇచ్చిన మా ప్రిన్సిపాల్ డా. జె. కనకదుర్గ గారు, మా వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డా. వి.వి. రమణ గారిని అడిగి మొక్కల శాస్త్రీయ నామాలను తెలుసుకున్నాను.

దీనిగూర్చి మా ప్రిన్సిపాల్ మేడమ్ గారు మాకు చెప్పినప్పుడు నాకు మా తాతయ్య గారు గుర్తుకొచ్చారు. దీనికి మా బాటనీ మేడం గారు ఈ మొక్కల, ఆకుల శాస్త్రీయ నామాలను ఎంతో ఓపికతో నాకు తెలియజేసి, చాలా సహాయం చేశారు.

నేను మా తాతయ్య గారు అయిన శ్రీ పిన్నింటి వెంకట రెడ్డి గారి వద్ద తెలుసుకుని వ్రాశాను. వీటిని మా తాతయ్య గారు వారి తండ్రిగారి వద్ద చూసి నేర్చుకున్నారు. వారు మహా గొప్ప ఆయుర్వేద శాస్త్రజ్ఞులు. ఎంతటి వ్యాధిని అయినా పోగొట్టేవారట. వారు ఇప్పుడు స్వర్గస్తులైనారు. వీటిని వ్రాసుకుని వచ్చాను కానీ, వాటి ఆకులు, పుష్పాలు, మొక్కలు అన్నింటిని మా నాన్నగారు, మా అమ్మగారు వెతికి తెచ్చి పరోక్షంగా నా ప్రోత్సాహానికి కారణం అయ్యారు. మా తాతయ్య గారి గ్రామం వరంగల్ జిల్లా, తాడ్వాయి.

వీటిని పల్లె సృజన ద్వారా ప్రజలందరికి తెలియజేయుట వలన తక్కువ ఖర్చుతో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మంచి ఫలితాలను పొందవచ్చు. మా గ్రామంలో చాలావరకు వీటిని వాడి మంచి ఫలితాలను పొందటం జరిగింది. వీటిని అందరికి తెలియజేసి, మొక్కల వలన కలిగే లాభాలను అందరూ పొందేలా చేస్తారని ఆశిస్తున్నాను.

నాకు ఇంకా భవిష్యత్తులో మొక్కల ఔషధ విలువలే కాకుండా వాటిలో వుండే రసాయన సమ్మేళనాలను గూర్చి తెలుసుకుని ఈ సమ్మేళనాల ప్రభావం, వ్యాధులపై ఎలా ఉంటుందో తెలుసుకోవాలని వుంది.

**పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.**

**కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులచే గత సంచికలో కొన్ని ప్రకృతివైద్య చికిత్సలకు సంబంధించిన కొన్ని వివరాలను పాఠకులకు తెలియజేయడమైనది. ఈ సంచికలో మరికొందరు విద్యార్థులు సేకరించిన వైద్య చిట్కాలను 'పల్లెసృజన' పాఠకులకు అందిస్తున్నాం.**

**– ఎడిటర్.**

**1. గజ్జి, దురద, తామర వంటి రోగాల నివారణకు:**

తులసి ఆకులను, నిమ్మరసంతో నూరి గజ్జి, తామర, దురద ఉన్నచోట గంటకోసారి రాసినచో ఈరకమైన చర్మవ్యాధులను నివారించవచ్చు.

**2. కాళ్లనొప్పి తగ్గుటకు:**

శరీరంలోని అతివేడి వలన కాళ్ళనొప్పులు కలిగినపుడు బాగా కాగిన వేడినీటిలో ఒకమెత్తటి పొడి గుడ్డను అద్ది నొప్పి ఉన్నచోట కాపడం పెట్టినచో చాలావరకు కాళ్ళ నొప్పులకు ఉపశమనం లభిస్తుంది.



**3. రక్తం గడ్డలు, వేడి గడ్డల నివారణకు :**

పొగాకు ముక్కను ఉమ్మితో తడిపి గడ్డలపై అంటించినచో రక్తం గడ్డలు, వేడి గడ్డలు అణగిపోతాయి లేదా పగిలి చీము కారి మానిపోతాయి.

**4. పుండ్లు మానిపోవుటకు :**

నెయ్యి, తేనె కలిపి ఈ మిశ్రమాన్ని పుండు, చెణుకులు, కత్తిపోట్లు వంటి చిన్న చిన్న గాయాలపై పూసినచో త్వరగా అవి మానిపోవును.

**5. గోరుచుట్టుకు మందు :**

జిల్లేడు ఆకు, పసుపు నూరిన మిశ్రమానికి ఆవు వెన్నతో కలిపి ఆ ముద్దను గోరుచుట్టు మీద వేసి కట్టు కట్టినచో రెండుమూడు రోజుల్లో గోరుచుట్టు మానిపోతుంది.

**6. ముఖారవిందానికి చిట్కా:**

పచ్చి పసుపు, నువ్వులు కలిపి ముద్దగా నూరి, రాత్రిపూట ముఖానికి రాసుకొని ఉదయం లేచి వేడి నీటితో కడిగిన యెడల అన్ని రకముల మచ్చలు పోయి ముఖం అందంగా తెల్లగా ప్రకాశించును.

**7. గజ్జి నివారణకు మందు :**

గంధమును కొబ్బరి నూనెలో నూరి గజ్జి ఉన్న వ్యక్తి శరీరంపై పూసుకుని అయిదు గంటలుఆరనిచ్చి ఆ తరువాత సబ్బుతో స్నానం చేయాలి. ఇలా ఐదు రోజులు చేసినచో గజ్జి వ్యాధి నయమగును.

**8. వేడి గడ్డలు (సెగ గడ్డలు) పగులుటకు మందు**

పసుపు కొమ్ము, ఆవగింజలు రెండింటిని సమ భాగంలో కలిపి నూరి, ముద్దను గడ్డలపై వేసి కట్టు కట్టినచో గడ్డలు మూడు రోజుల్లో పగిలిపోవును.



**9. శరీరం అందంగా, తెల్లగా ఉండటానికి :** స్నానానికి ముందు నీటిలో ఉప్పు, నిమ్మకాయ కలిపి వంటికి పూసుకుని స్నానం చేయాలి. ఇలా చేస్తే శరీరంగా అందంగా, కాంతివంతంగా ఉంటుంది.

**10. గజ్జి నివారణకు మరో చిట్కా :** ఉమ్మెత్త ఆకుల రసం 60 గ్రా., ఉమ్మెత్త ఆకులు నూరిన ముద్ద 75 గ్రా., ఆవు నెయ్యి 60 గ్రా. తీసుకుని ఈ మిశ్రమాన్ని ఒక కళాయి పాత్రలో పోసి సన్నటి వేడి సెగపై పెట్టి వీటి రసం ఇగిరిపోయి, నెయ్యి మిగులునప్పుడు దించి వడకట్టు కోవాలి. ఆ ద్రావణాన్ని ఒక వెడల్పాటి మూతగల సీసాలో భద్రపరచుకుని ఈ రసాన్ని గజ్జి ఉన్నచోట రాయాలి.

**11. చేతులు, అరికాళ్ళ మంటల నివారణకు :** చల్లటి నీటిలో పెసర పప్పు నానవేసి, అందులో కొంచెం హారతి కర్పూరం కలిపి నూరి అరికాళ్ళకు పట్టించిన యెడల అరికాళ్ళ మంట, అరిచేతుల మంటలు ఇట్టే మాయమౌతాయి. ఆవువెన్న అరికాళ్ళకు పట్టించి బాగా మర్ధన చేసి కొంచెం నిప్పు సెగకు చూపించినచో చాలా రోజులుగా ఉన్న అరికాళ్ళ మంటలు నయమౌతాయి.

**12. దద్దుర్లు, దురద పోవుటకు :** మిరియాలు 30 గ్రా. గంధము 20 గ్రా. నెయ్యి 20 గ్రా. కలిపి చిన్న చిన్న ముద్దలు (కుంకుడు



కాయంత) చేసి దురద ఉన్నవారు రోజుకు రెండు పూటల తిన్న యెడల వాటి నివారణ జరుగుతుంది.

**13. తలలో ఉన్న మురికి పోవుటకు :** కంది పప్పు, నిమ్మకాయ రసంతో తలను మర్దించి తలస్నానం చేసినచో తలలో ఉన్న మురికి పోయి జుట్టు నునుపుగా, తయారవుతుంది.

**14. ముఖంపై మచ్చల నివారణకు :** పాలు, నిమ్మరసం సమభాగంలో కలిపి మొహంపై రాత్రిపూట మర్దించి, ప్రొద్దున్నే వేడి నీటితో కడిగి స్నానం చేసిన యెడల ముఖంపై ఉన్న మొటిమలు, మచ్చలు పోవును.

**15. తలనొప్పికి మందు :** తలనొప్పి వలన నిద్ర పట్టక పోవుట జరుగుతుంది. ఈ తలనొప్పి నివారణకు తులసి ఆకులను తీసుకుని నీడలో ఆరబెట్టి ఎండిన తరువాత ఒక పొడి గుడ్డలోచుట్టి సీసాలో భద్రపరచుకుని తలనొప్పి వచ్చినపుడు ముక్కుద్వార పీల్చుకోవటం వల్ల తీవ్రంగా ఉన్న తలనొప్పి కూడా నయమవుతుంది.

**16. వేసవి కాలం వచ్చే తలనొప్పి పోవుటకు :** పది గ్రాముల ధనియాలు తీసుకుని మెత్తగా నూరి నీటితో కలిపి తలకు పట్టించుకున్న యెడల తలనొప్పి మటుమాయమవుతుంది.

**17. దంత వ్యాధులను నివారించే పండ్లపొడి :**

పొగాకు 2 తులాలు, వడకట్టిన బంకమట్టి 2 తులాలు, మిరియాలు 2 తులాలు వీటిని మెత్తగా నూరి సీసాలో భద్రపరచి రోజూ పండ్లు తోముకొన్నచో చిగుళ్ళ వాపు, దంతపు సలుపుడు, పళ్ళ నుంచి చీము కారుట వంటి వ్యాధులను నివారిస్తుంది.

**18. గొంతు మూసుకుపోయి, ఏ పదార్థాలు మింగలేని వ్యాధికి మందు :**

2–3 కుంకుడు కాయలు తీసుకు వచ్చి లోపలి గింజలు తీసివేసి, ఆ కాయను అయిదు తులములు నీటిలో బాగా పిసికి నోట్లో పోయవలెను. కుంకుడు కాయల గింజలు అరగదీసిన గంధమును కంఠంపై పెట్టవలెను. ఇలా రెండు, మూడు సార్లు చేసినచో గొంతు తెరచుకొని ఔషధము, ఆహారము నోటిలోనికి పోవును.

**19. డిఫ్తీరియా వ్యాధి పోవుటకు మందు :**

తమలపాకు రసం గంట గంటకు రెండు చెంచాల చొప్పున ఇచ్చిన డిఫ్తీరియా వ్యాధి నివారించబడును.

**20. నోటిలోని వేడి కురుపులు మానుటకు :**

మల్లె ఆకులు నమిలి ఉమ్మివేస్తే నోటిలోని కురుపులు మానిపోతాయి.

**21. పంటి నొప్పి పోవుటకు :**

మంచి ఇంగువను తెచ్చి, నిమ్మకాయ రసంతో నూరి కొద్దిగా వేడి చేసి అందులో దూది తడిపి పంటినొప్పి ఉన్నచోట ఉంచుకుంటే నొప్పి త్వరగా తగ్గుతుంది.



**22. కాలిన మంటలు తగ్గుటకు :**

కాలినచోట తేనెను రాసినచో బొబ్బలు, విపరీతంగా వచ్చే మంట తగ్గును.

**23. నారి కురుపులు పోవుటకు మందు :**

ఉమ్మెత్త ఆకును నూరి ముద్ద చేసి కొంచెం నెయ్యితో ఉడికించి నారికురుపై కట్టు కట్టినచో 4–5 కట్లకు పురుగు బయటకు వచ్చి కురుపు పూర్తిగా నయమగును.

**24. రక్తం కారకుండా ఆగిపోవుటకు మందు :**

కోసుకుపోయిన లేదా ఎలాంటి గాయాలు అయి రక్తం కారుతుంటే బంతి ఆకు రసం పోసి ఆకుతో కట్టు కట్టిన రక్తం కారటం ఆగిపోవును.



**25. అతి చెమట హరించుటకు చిట్కా :**

కరక్కాయ పెచ్చును నీటితో నూరి శరీరానికి పట్టించి ప్రతిరోజూ స్నానం చేసినచో అతి చెమట తగ్గిపోవును.

**26. కాలిన పుండ్లు తగ్గుటకు :**

మాడ్చిన బార్లీ బియ్యం, నువ్వులు నూనెతో మర్దించి కాలిన పుండ్లపై రాసినచో త్వరగా మానిపోవును.

**27. ముల్లు గుచ్చుకొన్నపుడు :**

ఏ భాగములోనైనా సరే ముళ్ళు గ్రుచ్చుకొన్నచో ఆపరేషన్ చేయనిదే బయటకు తీయుటకు వీలు కానపుడు ఉమ్మెత్త ఆకు ఒక దాన్ని బెల్లంతో కలిపి తినిపించవలెను. ఎంతటి ప్రమాదకరమైన ముల్లు అయినా 2 రోజుల్లో లోపల ఉన్నది బయటకు వచ్చును.

**28. పసుపు వైద్యం :**

ఏ విధమైన గాయం అయినప్పటికి పసుపు, సున్నం కలిపి నూరి రాసినచో త్వరగా మానిపోవును.

పసుపును అరగదీసి, గాయాలపై రాసిన గాయములోని పురుగులు చచ్చిపోయి త్వరగా మానిపోవును.

**29. చర్మంపై కురుపులు హరించుటకు :**

మంచి రాతి సున్నమును తేనెతో నూరి పట్టించిన యెడల చర్మంపై ఉన్న అన్ని కురుపులు తగ్గిపోవును.

**30. కళ్ళ వాపు హరించుటకు :**

తెల్ల చిక్కుడు ఆకు, ఆముదము గింజలు సమంగా కలిపి నూరి పట్టిస్తే కళ్ళ వాపు తగ్గుతుంది.



**31. పులిపిరి కాయలు తగ్గుటకు :**

కొత్త సున్నంలో, అల్లం ముక్క నూరి పులిపిరిని సూదితో బాగా చెక్కి సున్నంలో ముంచి పులిపిరి కాయపై బాగా రుద్దినచో పులిపిరి కాయలు తగ్గిపోవును.

**32. ఒంటి దురదలు పోవుటకు మందు :**

నాలుగు తులముల ఆవాలను కొంచెం నీటిలో నూరి వెచ్చజేసి, వంటికి నలుగు పెట్టుకోవాలి. ఈ విధంగా 4-5 రోజులు రోజూ చేయవలెను.

**33. రక్తం శుద్ధి అవుటకు చిట్కా :**

అరకప్పు మేక పాలలో ఒక చెంచా తేనె కలుపుకొని ప్రతిరోజూ త్రాగవలెను. ఇలా రోజూ చేస్తే రక్తం శుద్ధి అవుతుంది.

**34. వాపులు పోవుటకు మందు :**

ఉమ్మెత్త ఆకునకు ఆముదము రాసి, వెచ్చచేసి, వాపుపై వేసి కట్టు కట్టిన అన్ని రకముల వాపులు తగ్గిపోవును.

**35. కళ్ళ నొప్పులు పోవుటకు మందు :**

తమలపాకుల రసం 2-3 చుక్కలు కండ్లలో వేసినచో కంటి దురదలు, కంటి నొప్పులు తగ్గును.

**36. కండ్ల మంటలు తగ్గుటకు :**

చామంతి పువ్వు పది తులములు, 20 తులముల నీటిలో నానవేసి కాచి, ఆ నీళ్లతో కండ్లు తుడుచుకుంటే కండ్ల మంటలు పోవును.

**37. కండ్ల కలకలు పోవుటకు మందు :**

పసుపు పొడిని 3 తులములు తీసుకుని, 20 తులముల నీటిలో వేసి ఆ నీటితో కండ్లు తుడుచుకున్నచో కండ్ల కలకలు తగ్గిపోవును.

**38. కంటి పువ్వులు పోవుటకు :**

ఖర్జూర గింజను కాని, మునగ కాయ గింజను కాని అరగదీసి ప్రతిరోజూ పెట్టుకొన్నచో కంటి పువ్వులు పోవును.

**39. కంటి మంటలు పోవుటకు మందు :**

ఉసిరి పప్పు, నువ్వులు కలిపి నూరి కండ్లపై రాసుకున్నచో కంటి మంటలు పోవును.

**40. రేచీకటి పోవుటకు మందు :**

ఆవుపేడను ఒక గుడ్డలో వేసి రసము తీసి, దుకాణాల్లో దొరికే పిప్పళ్ళను ఈ రసంతో సానపై అరగదీసి ఈ గంధమును రాత్రిపూట ఒక పెసరు గింజంత కండ్లలో కాటుక వలె పెట్టుకొన్నచో 2 వారాల్లో రేచీకటి తగ్గిపోవును.

**41. కంటి జబ్బులకు మందు :**

ప్రొద్దున లేచి తన ఉమ్మిని కండ్లకు కాటుకవలె రాసుకున్నచో అన్ని రకాల కండ్ల రోగాలు రాకుండా వుంటాయి.

ఎవరికైనా మగ పిల్లవాడు పుట్టగానే ఆ పుట్టిన పిల్లవాడు పుట్టిన వెంటనే మూత్రం విడిచినట్లయితే ఆ మూత్రాన్ని కన్నులకు రాసుకున్నచో జీవితంలో ఎప్పటికీ దృష్టి మాంద్యం రాదు.

**42. కంట్లో పొర పోవుటకు మందు :**

ఒక మిరియపు గింజను కాకరాకు రసంతో ఇనుప రేకుపై అరగదీసి ప్రతిరోజూ కండ్లలో వేసుకున్నచో కన్నులలోని పొగవలె ఉన్న పొర మానిపోవును.

**43. చెవుడు, చెవిలో కురుపులు, చీము కారుట తగ్గుటకు మందు :**

ముల్లంగి దుంపల రసం ఐదు తులములు, నువ్వుల నూనె 2 తులములు ఈ రెండింటిని సెగపై వండి నీరు మరిగిన తరువాత దించి, చల్లారిన తరువాత ఆ నీటిని సీసాలో పోసి భద్రపరచుకొని, ప్రతిరోజూ మూడు చుక్కలు చెవిలో పోసుకొని దూది పెట్టుకోవలెను. ఇలా చేస్తే చెవుడు, చెవిలో కురుపులు, చీము కారుట తగ్గును.

**44. చెవిపోటు త్వరగా తగ్గుటకు :**

గురిగింజంత సారం (నల్లమందు) ను పావుతులం తల్లి పాలలో రంగరించి చెవిలో వేసుకున్నచో చెవిపోటు త్వరగా తగ్గును.

**45. ఉబ్బసం పోవుటకు మందు :**

ప్రొద్దున్నే పండ్లు తోముకొన్న వెంటనే 5 తులముల పటిక బెల్లం, పానకము నందు ఒక చుక్క జిల్లేడు పాలు వేసుకుని త్రాగవలెను. ఒక అరగంటలో డోకు వస్తుంది. అప్పుడు శ్లేష్మం మొత్తం బయటకు పోవును. ఉబ్బసం వెంటనే తగ్గును. డోకు వలన కంగారు పడనవసరం లేదు. ఇలా 4 రోజులు చేయాలి. తరువాత వారం ఇలా చేయవద్దు. తరువాత మరలా నాలుగు రోజులు ఈ మందును వాడవలెను. ఇలా 4-5 సార్లు చేసినచో ఉబ్బసం వ్యాధి పూర్తిగా తగ్గును.

**46. దగ్గును హరించుటకు :**

నువ్వుల కషాయంలో పంచదార కలిపి త్రాగినచో దగ్గు తగ్గుముఖం పట్టును.

**47. కామెర్ల వ్యాధి పోవుటకు మందు :**

పటిక బెల్లం 2 తులములు, ఆవాలు పావు తులం. ఈ రెంటిని కలిపి మెత్తగా నూరి 4 మాత్రలుగా చేసి, ప్రొద్దునొక మాత్ర, సాయంత్రం ఒక మాత్ర చొప్పున అరటి పండులో పెట్టుకుని తిన్నచో కామెర్ల వ్యాధి తగ్గుతుంది. పొట్ట కల వారికి కొవ్వు కరుగును.

**48. కడుపులో బల్లలు తగ్గుటకు :**

తులసి ఆకు రసం ప్రతిపూటకు రెండు చెంచాల చొప్పున త్రాగవలెను. ఇలా చేస్తే కడుపులో బల్లలు తగ్గును.

**49. కాలేయం (లివర్) జబ్బులకు మందు :**

నిమ్మరసం త్రాగుతూ, టమోటా పండ్లను తినుచుండిన యెడల కాలేయ జబ్బులు తగ్గును.

బొప్పాయి పండ్లు తిన్నచో కూడా కాలేయ జబ్బులు తగ్గును.



# సులువుగా చీపుర్ల తయారీ

## పోలా పిచ్చయ్య క్రియాశీలత



ఆంధ్రప్రదేశ్ లోని చాలా గ్రామాల్లో 'ఎరుకలు' అనే ఒక యస్.టి. జాతి ఉన్నట్లు పాఠకులకు విదితమే. వారి ప్రధాన వృత్తి బుట్టలు, పొరుకలు, తడకలు అల్లడం వాటిని అమ్ముకుంటూ తమ జీవనోపాధిని గడుపుకుంటారు.

ఎరుకలు.... గిరిజనుల్లో ఒక తెగ. వారిలోనూ ఇంకొన్ని ఉప తెగలున్నాయి. వాటిలో ఒకటి కుంచెరుకల తెగ. చీపురు కట్టల తయారీ వారి ప్రధాన వృత్తి. ఏపూటకా పూట తిండి కోసం లాటరీ కొట్టే దాదాపు 20 లక్షల మంది కుంచెరుకల్లో 'పోలా పిచ్చయ్య' ఒక సామాన్యుడు. అతడికి చదువు రాదు, ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు ఇతను తన జాతి వారి జీవితాల్లో వెలుగు నింపిన దేవుడు. ఇక ఈ సామాన్యుని ఫ్లాష్‌బ్యాక్ చూద్దామా!

రెండు దశాబ్దాల క్రితం చీపుళ్ల తయారీకి అవసరమైన ఈత బరుగు (ఈత చెట్టు ఆకులు - రెమ్మలు) సేకరించుకోవడం, దాన్ని సన్నగా చీరి, చివరి ముళ్ళు తొలగిపోయేలాగ ఓ చెక్క పలకపై రుద్దడం, ముళ్ళు పోయాక మెత్తగా తయారైన వాటితో చీపుర్లు తయారు చేయడం. ఇదీ పిచ్చయ్య దినచర్య. పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా పది, ఇరవై చీపుర్లకు మించి తయారు కావు. వాటిని అమ్మగా వచ్చేది ముప్ఫై రూపాయలు. అయినా.. వేరే వృత్తి చేతకానందున బతుకుదెరువు కోసం ఈ పని చేయక తప్పని పరిస్థితి. అదే పిచ్చయ్యను ఆలోచింపజేసింది. చీపుర్ల తయారీకి ఓ యంత్రం ఉంటే బావుంటుందన్న ఊహ వచ్చేలా చేసింది. మనసులో కదలాడుతున్న ఊహ ప్రకారం అతను ఓ చెక్క మొద్దును తీసుకుని గుండ్రంగా కోయించాడు. దాని లోపలి భాగాన్ని తొలిచి చక్రం మాదిరిగా తయారు చేశాడు. దానికి సైకిల్ ఊచలను దిగ్గొట్టి ఆ ముళ్ల చక్రాన్ని 1 హెచ్.పి. విద్యుత్తు మోటారుకు అనుసంధానించాడు. అతని ప్రయోగం విజయవంతమైంది. మోటారు సహాయంతో వేగంగా తిరిగే ఆ ముళ్ల చక్రంపై ఈత బరుగు ముళ్ళను తొలగించి, మెత్తగా చేయడం సులభతరమైంది. కానీ, అక్కడితో ఆగిపోలేదు పిచ్చయ్య. పెద్ద పెద్ద పైపులకు వాడే ప్లాస్టిక్ మూతకు టైర్ల బప్పింగ్‌కి



ఉపయోగించే మేకులను దిగ్గొట్టి, చెక్క చక్రం స్థానంలో అమర్చాడు. అది మరింత సౌకర్య వంతంగా మారింది. అలా ఆనాడు పిచ్చయ్య రూపొందించిన ఆ యంత్రం కుంచెరుకల జీవితాల్లో ఓ విప్లవాత్మకమైన మార్పునే తీసుకు వచ్చింది. అది వారి జీవన యంత్రం అయింది. ఇప్పుడు రాష్ట్రంలోని ప్రతి కుంచెరుకల కుటుంబంలోనూ ఈ యంత్రం కనిపిస్తుంది. దానిపై పిచ్చయ్యకు ఇప్పటికీ ఎలాంటి పేటెంటు హక్కులూ లేవు. 'నాకోసం తయారు చేసుకున్న యంత్రం... నా జాతోళ్లకు మేలు చేస్తోందంటే... అంతకన్నా కావలసిందేముంటది' అంటాడతను వినమ్రం గా. ఈ యంత్రం తయారు చేయకముందు కుంచెరుకలు చేతితో పది చీపుళ్లు తయారు చేసి రోజుకి 30 రూపాయలు సంపాదిస్తే... ఇప్పుడు పదుల సంఖ్యలో తయారు చేసి వందల్లో సంపాదించుకుంటున్నారు.

మన రాష్ట్రంలోఅమ్ముకోగా మిగిలిన చీపుళ్లను ఢిల్లీ, మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

అదే లోటు....

తనకు సహజంగా తెలివి తేటలున్నా... చదువు లేకపోవడమే బాధాకరం అంటాడు. పిచ్చయ్య 'మా కుటుంబం సూర్యాపేటలో ఉండేది. అమ్మ ఇంటింటికీ తిరిగి సోది చెప్పేది. మా నాయన పందులు కాసేటోడు. పదేళ్ళ వయసులో సోదె బుట్ట మోసుకుంటూ మా అమ్మ కూడా పోయేవాణ్ని. పదిహేనేళ్ళొచ్చాక నేనూ పందుల్ని గాడిదల్ని కాసినా, తర్వాత ప్రభుత్వం పందుల్ని పెంచొద్దనడంతో కొన్నాళ్ళు పిట్టల్ని వేటాడి, వాటిని అమ్ముకుని బతికినం. నీటిబాతులు, గోరింకలు, బురక పిట్టలు వంటి వాటిని ఎక్కువగా పట్టుకోవడానికి నా తెలివి తేటల్ని ఉపయోగించి వలలు తయారు చేసిన కొన్నాళ్ల కి హైదరాబాద్ వచ్చేసినం. ఇక్కడ చీపుళ్లు తయారు చేసేటోళ్లం. ఆ రెక్కల కష్టానికి తట్టుకోలేక ఈ యంత్రం తయారు చేసిన. ఇప్పుడు మా వాళ్ళంతా ఇంటికొకటి చొప్పున తయారు చేసుకుంటున్నరు. దీన్ని కనిపెట్టినం దుకు వాళ్ళందరూ నన్ను ఎప్పుడూ యాజ్జేసు కుంటరు. ఇంతకంటే గౌరవం ఏం కావాలె నాకు" అంటాడు పిచ్చయ్య. అతని భార్య గంగమ్మ, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. తనలాగా చదువులేని లోటు తన పిల్లలకు ఉండకూడ దని భావించిన పిచ్చయ్య కొడుకులు, కోడళ్లను కూడా చదివిస్తున్నాడు. తిండికి, బట్టకు లోటు లేదు. ఇప్పుడెంతో సంతోషంగా జీవిస్తున్నా మంటాడు పిచ్చయ్య నవ్వుతూ. తరచి చూస్తే ఆ నవ్వులో ఒకే అర్థం కనబడుతుంది. మనిషి తలుచుకుంటే సాధ్యం కానిదేదీ లేదని! ●

'ఈనాడు' సౌజన్యంతో...

# సేంద్రియ క్రిమిసంహారిణి "సైన్సశ్రీ"

శ్రీ ఎన్. బాలసుబ్రమణియన్ తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్టణం జిల్లా మైలాదుథురై నివాసి. వీరు హయ్యర్ సెకండరీ (+2) వరకు విద్యను అభ్యసించారు. గత 15 సంవత్సరాలుగా ఇతని ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇతనికి సేంద్రియ వ్యవసాయం పట్ల అభిరుచి ఎక్కువ. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు వాడటం వల్ల మొదట్లో లాభాలు కనిపించినా, తర్వాతి కాలంలో నేలకు, పర్యావరణానికి కలిగే శాశ్వత నష్టాలను గురించి తెలుసుకున్న బాలసుబ్రమణి యన్ సేంద్రియ వ్యవసాయం పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. ఈ ప్రక్రియలో తను సహజంగానే క్రిమి సంహారణకు, రోగ నివారణ కొరకు తన చుట్టూ వున్న పరిసరాల్లోని మొక్కలతో ఒక ఔషధాన్ని తయారు చేశారు.

ఈ ఔషధం ద్వారా మొక్క పెరగడంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని గమనించాడు. గత ఆరు సంవత్సరాలుగా ఈ ఔషధాన్ని తాను స్వయంగా తయారు చేసుకుని పొలంలో వాడుతున్నాడు. ఇతని అభిరుచిని గుర్తించిన వ్యవసాయ అధికారులు ఇతన్ని 'సేంద్రియ రైతు క్లబ్'లో సభ్యునిగా నియమిం చడం జరిగింది.

**కావలసిన వస్తువులు:**

| | |
|---|---|
| సముద్రపు నాచు (సర్గసమ్) | – 20 కి.గ్రా. |
| విప్పగింజల చెక్క (బ్యాసియా ల్యాటిఫోలియా) | – 1 కి.గ్రా. |
| వస (అక్రోస్ కాలమస్) | – 1 కి.గ్రా. |
| అడ్డసరం(జస్టిషియాఅడథోడ) | – 500 గ్రా. |
| చేపలు, బెల్లం మిశ్రమం | – 20 మి.లీ. |
| సారా | – 50 మి.లీ. |
| కలబంద (అలోవీరా) | – 1 కి.గ్రా. |
| సబ్బు నీళ్ళు | – 100 గ్రా. |

పై వస్తువులను ఉపయోగించి వ్యాధి నియంత్రణ ఔషధాన్ని తయారు చేశాడు. దీనికి 'సైన్సశ్రీ' అని నామకరణం చేశారు. దీనిని ఎకరానికి 250 మి.లీ. చొప్పున రెండు, మూడు పర్యాయాలు ఉపయోగించాలి. దీనిని పంటలపై చల్లినప్పుడు చక్కని హరిత వర్ణానికి మారడమే కాకుండా మంచి ఫలసాయాన్ని కూడా ఇస్తుంది. ఇది పంటలను క్రిమి కీటకాల నుండి వివిధ రకాల తెగుళ్ళనుండి కాపాడుతుంది.

ఈ వ్యాధి నియంత్రణ ఔషధాన్ని గత ఆరు సంవత్సరాలుగా సుమారు 60 మంది రైతులు మినుము, పెసర, చిక్కుడు, చెఱకు, అరటి, కొబ్బరి, కాఫీ, టీ మొదలగు పంటలపై దాదాపు 200 ఎకరాలలో ఉపయోగించి చక్కని ఫలితాలను పొందారు.

*'సేవా' తమిళనాడు సౌజన్యంతో*



# టైర్లకు గాలికొట్టు టకు
# అతి చిన్న మొబైల్ పంపు

**పల్లెల్లో మోటారు సైకిల్ టైర్లో
గాలి తక్కువైతే ఎంత ఇబ్బంది పడతాం?
ట్రాక్టర్ టైర్లో గాలి తగ్గిందంటే
అది నింపుకోటానికి ఎన్ని మైళ్ళు ప్రయాణించాలి?
వీటన్నింటికి ఓ పరిష్కారం
రవికుమార్ చిన్న గాలి పంపు!**



డి.వి. రవికుమార్, పాలకొల్లు

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నివాసి డి. వెంకట రవికుమార్. ఇతను బి.ఏ. వరకు చదువుకున్నాడు. తనకు చిన్నప్పటి నుండి సైన్స్ ప్రయోగాలంటే ఆసక్తి ఎక్కువ. అందుకే ఇంజనీరింగ్ చేద్దామనుకున్నాడు కానీ, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అందుకు సహకరించక పోవడంతో డిగ్రీతోనే చదువుకు స్వస్తి చెప్పాడు. కాని వివిధ రకాల పరికరాలను కనిపెట్టడంలో తనకున్న ఆసక్తిని వదులుకోలేదు. తనకున్న కొద్దిపాటి విజ్ఞానంతో చిన్న చిన్న ప్రయోగాలు చేస్తూ ఉంటాడు. గతంలో ఒక ప్లాస్టిక్ బాక్స్‌లో క్యాలెండర్ తయారు చేశాడు. దీని ద్వారా ఏ తారీఖు ఏ వారం వస్తుందో తెలుసుకోవచ్చు. అలా ఎన్ని వేలు, లక్షల సంవత్సరాలకైనా తెలుసుకోవచ్చు.

ఈమధ్యనే మొబైల్ ఎయిర్ పంపును తయారు చేయడం జరిగింది. ఈ పంపు ద్వారా గ్రామీణులకు ఎంతో లాభం చేకూరడంతో పాటు ఎంతో ఉపయుక్తంగా కూడా వుంటుంది. ప్రస్తుతం దాదాపు ప్రతి గ్రామంలో మోటార్ సైకిల్‌లు, ట్రాక్టర్‌లు ఉండటం సహజంగా మారిపోయింది. కానీ, ప్రతి గ్రామంలో వాటి టైర్లలో గాలి నింపుకోవాలన్నా, టైర్లు పంచర్ అయినా చేయగలిగే మెకానిక్ వసతి లేదు. ఈ సమస్య పరిష్కారానికి రవికుమార్ అతి సులభంగా ఆపరేట్ చేయగల, అతి చవకైన ఒక పంప్ సెట్‌ను కనుగొన్నాడు. దీని ద్వారా అన్ని మోటార్ బైక్‌ల టైర్లకి, ట్రాక్టర్ల టైర్లకి గాలి ఎక్కించవచ్చు. ఇది కేవలం 8 అంగుళాల పొడవు మాత్రమే వుంటుంది. (ఇక్కడ వున్న బొమ్మ ఆ పంపును వాడేటప్పుడు విడదీసినది).



బైక్ మీద ప్రయాణిస్తున్నపుడు దారిలో అకస్మాత్తుగా టైర్‌లో గాలి తగ్గిపోతే వెంటనే అక్కడే ఈ పరికరం ద్వారా గాలి కొట్టేవాడి దగ్గరకు వెళ్ళకుండా ఎవరికి వారే టైర్‌కి గాలి ఎక్కించుకోవచ్చు. ఈ గాలి పంపు కాలితో ఆపరేట్ చేసే విధంగా ఉండటం వల్ల టైర్లకు గాలి ఎక్కించుకోవడం కూడా చాలా సులభం. ఈ పరికరం ఆరున్నర అంగుళాల స్టీల్ పైప్‌తో తయారు చేయడం జరిగింది. దీనికి మీటర్‌ను కూడా బిగించడం జరిగింది. మార్కెట్‌లో దొరికే నట్లు, బోల్టులతో పాటు కొన్ని పార్ట్‌లు రాగి లోహంతో తయారు చేయించడం జరిగింది. దీనికి నిర్వహణ ఖర్చు కూడా ఉండదు. దీనిని వాల్వ్‌తో ప్రత్యేకంగా



తయారు చేయడం వల్ల చాలా మెత్తగా కూడా ఉంటుంది. ఈ పరికరం మోటార్ సైకిల్ డిక్కీలో అమరేంత సైజులో మాత్రమే ఉంటుంది. అందువల్ల ఎప్పుడైనా ఎక్కడికైనా దీన్ని తీసుకు వెళ్ళడం చాలా సులభం. ఎక్కడైనా ఉపయోగించుకోవడం కూడా సులభమే.

రవికుమార్ గోడలకు మేకులు కొట్టేందుకు ఉపయోగించే జంపర్‌ను కూడా కొద్దిపాటి మార్పులతో తయారు చేయడం జరిగింది. గోడకి రంధ్రాలు చేసేటప్పుడు ఒక్కోసారి డ్రిల్లింగ్ బిట్ లోపలే విరిగి పోవడం జరుగుతూ వుంటుంది. అలా విరిగిన ముక్కను తీయడం సాధ్యం కాక జంపర్ ఉపయోగ పడకుండా పోతుంది. రవికుమార్ తయారు చేసిన ఈ జంపర్ సహాయంతో విరిగిన ముక్కను సులభంగా తీసి, మరలా ఉపయోగించుకోవచ్చు. తర్వాత స్క్రూలు కూడా సులువుగా బిగించడానికి, తీయడానికి ఒక స్క్రూ డ్రైవర్‌ను కూడా తయారు చేయడం జరిగింది.

వెంకట రవికుమార్ లాంటి గ్రామీణ శాస్త్రవేత్తలెందరో వెలుగులోకి రానివారు మన రాష్ట్రంలో చాలామంది ఉన్నారు. ఇలాంటి వారు తమ ప్రయోగాలను పల్లెసృజనకు తెలియజేయడం ద్వారా వారి ప్రయోగాలు విశ్వ వ్యాప్తం కావడమే కాక, వారు కూడా ఎంతో లాభాన్ని ఆర్జించే అవకాశం ఎక్కువ.

రవికుమార్ కనిపెట్టిన ఈ గాలి పంపును గ్రామస్తులు విరివిగా వినియోగించేలా హనీబీఏపి త్వరలోనే ఈ పరికరాన్ని పెద్దయెత్తున తయారు చేసేందుకు ఒక పారిశ్రామిక వేత్తతో ఒప్పందాన్ని కుదిర్చి అందరికీ అందుబాటులో ఉండేలా చేయడానికి కృషి చేస్తోంది.

●

## పల్లెసృజన పాఠకులు కూడా ఇన్నోవేటర్లు కావచ్చు!

**మీరు చేయవలసిందల్లా**
**ఈ సంచికనుండి మేము ఓ అంశాన్ని మీకు ఇస్తున్నాము**
**అందుకు సంబంధించి మీకు తెలిసిన,**
**మీ గ్రామంలో ఎవరైనా చేసిన**
**పద్ధతులను వివరిస్తూ మాకు వ్రాసి పంపండి**
**మీరు వ్రాసిన దానిని పత్రికలో ముద్రించడంతో పాటు**
**పంపినందుకు కానుకగా మీకు ఒక సంవత్సరం పాటు**

**పల్లెసృజన**

**పత్రికను ఉచితంగా పంపుతాము.**

| | |
|---|---|
| **ఈ సంచికలో మీకు ఇస్తున్న అంశం :** | **మొలలు (పైల్స్) నివారణకు సాంప్రదాయ మందు ఉపయోగించిన వారి వివరాలు, ఉపయోగించే పద్ధతులు** |

**మీ రచనలు పంపవలసిన చిరునామా**

ఎడిటర్, పల్లెసృజన, 102, వాయుపురి కాలనీ, సికింద్రాబాద్ – 500 094.



# ఇద్దరు మిత్రుల కుర్ర'కారు'

**కారు కనిపెట్టాలంటే ఇంజనీరింగే చదవక్కర్లేదు ఏదైనా కనిపెట్టాలనే జిజ్ఞాస మనసులో ఉంటే మనిషి ఏదైనా సాధించవచ్చు అని నిరూపించారు గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు డిగ్రీ చదువుతున్న కుర్రాళ్ళు.**

ప్రస్తుతం సామాన్యుల మెదడులో ఊహలు రేపుతున్న 'నానో' కారు రూపకల్పనతో, మేముసైతం అంటూ ఇద్దరు మిత్రులు ఓ కారు రూపకల్పనకు ఉవ్విళ్ళూరుతున్నారు. వీరిద్దరూ ఏ ఆటో మొబైల్ ఇంజనీర్లో అయితే ఇదో వార్త అయ్యేది కాదు. వీరు మారుమూల పల్లెలనుంచి పట్నంలో చదువుకోవటానికి వచ్చినవారు. గుంటూరు బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో బిఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఓ సంవత్సరం కిందట వీరిలో ఒకరైన టి. కోటిరాము మదిలో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. అంతే, వెంటనే తనలాగే ఆలోచించే ఎస్. శ్రీనివాసరావుకు ఆ విషయం చెప్పాడు.

ఇద్దరు తమ భావాలను పంచుకుని ఓ కారుకు రూపకల్పన చేశారు. ఇంకా తుది మెరుగులు పూర్తికాని ఈ కారు లీటర్ డీజిల్‌తో 28 కి.మీ. మైలేజీ ఇస్తోంది. గంటకు 50 కి.మీ. వేగంతో రయ్యిమంటూ ముందుకు దూసుకు పోతోంది. దీనిలో ఒకరు మాత్రమే కూర్చొని ప్రయాణించే వీలుంది. అయితే దీన్ని ముగ్గురు కూర్చునే విధంగా కూడా తయారు చేయవచ్చుంటున్నారు. ఈ ఇద్దరు స్నేహితులు ఇవన్నీ ఓ ఎత్తయితే వీరు మరో విషయం నిరూపిస్తామంటున్నారు.

డిటెక్టివ్ కథల్లోలాగా ఈ కారు రోడ్డుమీదే కాక నీటిలో కూడా తేలుతూ ప్రయాణం చేసేలా రూపొందిస్తామంటున్నారు. వీరు దీనికోసం ఎయిర్‌పుష్ ప్రొఫెల్లర్, హైడ్రాలిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. అయితే ఈ శపథాన్ని నిరూపించు



కోవటానికి కచ్చితంగా మూడు నెలల వ్యవధిలో కారును నీళ్ళలో తేలేలాగా తీర్చిదిద్దుతామని అంటున్నారు. ఇంతవరకు కారు నిర్మాణానికి రూ. 20 వేలు వ్యయం అయిందని మరో 40 వేల రూపాయల వ్యయంతో తాము చెప్పిన విధంగా ఈ వాహనం సిద్ధమవు తుందని వీరంటున్నారు.

దీనికి కావాల్సినవన్నీ స్వయంగా డిజైన్ చేసుకున్నట్లు చెప్పారు. తమ ప్రయత్నానికి ఇంట్లో పెద్దలు, గ్రామస్తులు అండగా నిలిచారంటున్నాడు డి. కోటిరాము. ఈయన నరసరావు పేట మండలం పమిడిపర్రు (కోటప్ప కొండ సమీపంలోని ఊరు) నివాసి. ఎస్. శ్రీనివాస రావు సొంత ఊరు పత్తిపాడు మండలం కోయవారి పాలెం. రాముకు చిన్నప్పటి నుంచి వ్యర్థ పదార్థాలతో వస్తువులు తయారు చేయటం అలవాటని, అందుబాటు లో వున్న వస్తువులతోనే కారు తయారు చేసి ఊరిలో రయ్‌న తిరుగుతుంటే తమకు ఆనందంగా ఉందని పమిడిపర్రు గ్రామస్తులు అంటున్నారు. ఈ అపూర్వ మిత్రుల ఆత్మ విశ్వాసం, సాధన, క్రియాశీలత వారి కలలను త్వరలో నిజం చేస్తాయని ఆశిద్దాం. ●

*– ఈనాడు సౌజన్యంతో*



## శ్రీ చెల్లముత్తు

# పసుపు పంటకు సేంద్రియ రక్షణ

శ్రీ చెల్లముత్తు తమిళనాడుకు చెందిన ఈరోడ్ జిల్లా, కరుక్కంపాలయం అనే గ్రామవాసి. ఒక వ్యవసాయ కుటుంబానికి చెందిన రైతు. పసుపు పంటకు వచ్చే ఒక విధమైన తెగులు నివారణకు ఒక మందు తయారీకి సంబంధించిన సూత్రాన్ని రూపొందించాడు. పసుపు పంటకు సోకే ఈ వ్యాధిని స్థానిక వాడుక భాషలో 'సెంపోరియన్' అని వ్యవహరిస్తారు. ఇది కంటికి కనిపించని సూక్ష్మ క్రిముల ద్వారా మొక్క రసాన్ని పీల్చి పిప్పి చేసే వ్యాధి. ముందుగా ఆకుల పైభాగంలో ఎర్రని మచ్చలుగా మొదలై, క్రమేపీ ఆకు మొత్తానికి వ్యాపించి, కొంత కాలానికి మొక్క పూర్తిగా ఎండిపోతుంది. ఈ వ్యాధి సాధారణంగా కార్తీక, మార్గశిర మాసాల్లో అనగా నవంబర్, డిసెంబర్ నెలల్లోని చలికాలంలో, మొక్కలు నాటిన సుమారు 150 రోజుల ప్రాంతంలో సోకుతుంది.

సాధారణంగా రైతులు ఈ తెగులు నివారణకు 'బావిస్టిన్', డైథేన్ ఎమ్-45, మోనోక్రొటోఫాస్, రోగార్ వంటి వివిధ క్రిమి సంహారక మందులను సుమారు ఎకరానికి రూ. 600 నుండి 700 వరకు వెచ్చించి వాడుతూ వుంటారు. పసుపు పంటకు సోకే ఈ వ్యాధి నివారణకు ప్రతి 20 రోజులకు ఒక పర్యాయం ఇండోఫిల్‌గాని, డైథేన్ ఎమ్-45 గాని, చల్ల వలసిందిగా తమిళనాడు, కోయంబత్తూర్ వ్యవసాయ విశ్వ విద్యాలయాలు సిఫారసు చేసాయి. కాబట్టి ఒకసారి ఈ వ్యాధి సోకినట్టయితే రైతులు పంటను కాపాడు కోవటానికి అధిక మొత్తంలో డబ్బు ఖర్చు చేయవలసి వుంటుంది.

ఈ వ్యాధి నివారణకు శ్రీ చెల్లముత్తు ఔషధ సంబంధమైన ఒక సూత్రంతో ఒక మందును రూపొందించాడు.

**దీని తయారీకి అవసరమైన పదార్థాలు :**

వెల్లుల్లి-1 కి.గ్రా., అల్లం 50 గ్రా. పచ్చి మిర్చి - 50 గ్రా. మిరియాలు - 200 గ్రా., పొగాకు 500 గ్రా. వేప నూనె - 200 మి.లీ., ఖాది సబ్బు - 30 గ్రా.

**తయారు చేసే విధానం :**

ముందుగా వెల్లుల్లిని ఒక రాత్రంతా 100 మి.లీ. కిరోసిన్‌లో నానబెట్టి మరుసటిరోజు ఉదయం ఈ నానబెట్టిన వెల్లుల్లికి పచ్చి మిర్చి, మిరియాలు కలిపి మెత్తగా నూరి పక్కన ఉంచుకోవాలి. తరువాత పొగాకును ఒక రోజంతా నీటిలో నానబెట్టి తదుపరి వడగట్టి దానిని 200 మి.లీ. వేప నూనెతో కలపాలి. ఇప్పుడు ఈ రెండు మిశ్రమాలను మొత్తంగా కలిపి చివరిగా 30 గ్రా. సబ్బును దీనికి కలిపి బాగా కలియబెట్టాలి. ఇప్పుడు ఈ మొత్తం మిశ్రమం సుమారు 7 లీటర్లు తయారవుతుంది. ఈ మిశ్రమం సుమారు ఒక ఎకరానికి సరిపోతుంది. 700 మి.లీ. ఈ మిశ్రమాన్ని సుమారు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. మొత్తానికి 10 ట్యాంకుల మందు ఈ విధంగా పిచికారి చేయవలసి వుంటుంది.

ఈ విధంగా ఈ క్రిమి సంహార ఔషధాన్ని పిచికారి చేసిన తరువాత ఆకులు ముదురు ఆకుపచ్చగా మారి ఆ రంగు శాశ్వతంగా ఉండిపోతుంది. ఇప్పటివరకు పసుపు పంట పండించే ఆరుమంది రైతులు ఈ క్రిమి సంహారిణి వాడి చక్కటి ఫలితాలను పొందినట్లు పేర్కొన్నారు. లీటరు రూ. 40/-ల చొప్పున ఈ క్రిమి సంహార మందును చెల్లముత్తు తయారు చేసి అమ్ముతున్నాడు. చెల్లముత్తు రూపొందించిన ఈ క్రిమి సంహార మందు క్రిమి సంహారిణిగా పని చేయడమే కాక పర్యావరణాన్ని కూడా కాపాడుతుంది.

'సేవా' తమిళనాడు సౌజన్యంతో...



# పశువులకు కూడా 'ఎనిమా'

## రాజమాణిక్యం సహజ పశువైద్యం

మానవ జాతిలో మలబద్ధకం మూలంగా కలిగే బాధా నివారణకు ప్రకృతి సిద్ధమైన చికిత్సా విధానం ఎనిమా ఇవ్వడం. పశువుల వ్యాధుల నివారణ చేసే రాజమాణిక్యం అనే వ్యక్తి పశువులకు సంబంధించి వ్యాపించే కడుపు ఉబ్బరం, మలబద్ధకం, జ్వరం, మూత్ర సంబంధిత సమస్యలు, దొమ్మ వ్యాధి, ప్రేవులలో పురుగులు మొదలగు వ్యాధులకు ఎనిమా చికిత్సా విధానాన్ని రూపొందించారు. గత 7 సంవత్సరాలుగా తమిళనాడులో పశువులకు సంబంధించిన వివిధ వ్యాధుల నివారణకు కృషి చేస్తూ 2004లో రాజమాణిక్యం 'సృష్టి' సంస్థ సన్మానం కూడా పొందారు. కొన్ని పశువులు మలబద్ధకం మూలంగా చనిపోవడం చూసిన రాజమాణిక్యం జంతువులకు కూడా ఎనిమా చికిత్సా విధానాన్ని ఎందుకు ఉపయోగించరాదు అని ప్రయోగం చేశారు. చక్కని ఫలితాలు చూసిన తర్వాత జంతువులకు కూడా ఈ ఎనిమా చికిత్సా విధానం అనువైనదిగా భావించారు. సుమారు 25 పశువులు లేదా మేకలకు ఈ చికిత్స చేశారు. ఎనిమా చికిత్సకు కావలసిన వస్తువులు, తయారు చేయు విధానం ఈ క్రింద వివరిస్తున్నాం.

కావలసిన వస్తువులు :

నీళ్ళు 20 లీ., కొబ్బరి నూనె - 50 మి.లీ., రబ్బరు పైపుతో సహా ఎనిమా క్యాన్, నేలవేము (యాండ్రూ గాఫిస్ పనికులట) - 10 గ్రా.

**తయారు చేయు విధానం :**

10 గ్రా. నేలవేము పొడి కలిపిన నీటిని మరిగించాలి. ఈ నీటిని ఎనిమా క్యాన్‌లో నింపాలి. పశువు యొక్క మల విసర్జన అవయవానికి లోపల వెలువల కొబ్బరి నూనె పూయాలి. రబ్బర్ ట్యూబ్ చివరను మల ద్వారం లోపలికి పంపాలి. నీటితో నింపిన క్యాన్‌ను ఇప్పుడు పైకి ఎత్తాలి. ప్రకృతిసిద్ధంగా ఇప్పుడు ఆ నీరు మల ద్వారం గుండా లోపలికి వెళ్తుంది. తరువాత ఆ విధంగా లోపలికి ప్రవేశించిన నీరు తిరిగి వెలుపలకు రాకుండా ఉండటానికి మలద్వారం పరిసర ప్రాంతాన్ని చేతులతో నొక్కాలి. ఆ పశువును కొద్ది దూరం నడిపించాలి. మల ద్వారం ప్రాంతంలో చేయి తీసివేయగానే నీటితో సహా లోపలి మలిన పదార్థాలు బయటికి వచ్చేస్తాయి.

ఈ విధానంలో ప్రేగుల పని విధానం చక్కబడి మలినాన్ని వెలుపలకు విసర్జించ బడతాయి. ప్రేవులకు అంటి పెట్టుకొని వున్న ఎలాంటి సూక్ష్మ క్రిములైనా వెలుపలికి గెంటి వేసేందుకు ఈ ఎనిమా చికిత్స ఉపయోగ పడుతుంది. ఈ పొడి క్రిమి సంహారిణిగా కూడా పని చేస్తుంది.

ఈ విధానాన్ని మేకలకు, గొర్రెలకు, ఇతర జంతువులకు గూడా ఉపయోగించ వచ్చు. ఇది రక్త విరేచనాలను, మూత్రంలో రక్తం పోవడాన్ని, జ్వరాన్ని, అజీర్తిని, మలబద్ధకాన్ని, శ్వాస సంబంధిత వ్యాధులను తగ్గించడానికి, చూలు నిలవడానికి చక్కగా పని చేస్తుంది. ●

**– 'సేవా' తమిళనాడు సౌజన్యం**

ఇతర రాష్ట్రాల
పల్లె ఇన్నోవేషన్లు

# నిరంతర ఆవిష్కారి 'బచ్చుభాయ్ దేహియా'


Happy family





## స్టీరింగ్ లేని ట్రాక్టర్

ఎడ్లబండిలాగ నడిచే ట్రాక్టర్‌ను ఎవరైనా ఎందుకు తయారు చేస్తారు? నియంత్రణ సాధనాన్ని ఉపయోగించే బదులు, కుడి ఎడమ రెండు చక్రాలను విడివిడిగా త్రిప్పడానికి, వేగం పెంచడానికి, ఆపడానికి రెండు మీటలను రూపొందించారు. చాలామంది ఆటో మొబైల్ డిజైనర్లకు కూడా సాధారణంగా 'స్టీరింగ్ లేకుండా' అనే ఆలోచనే రాదు. కాని బచ్చుభాయ్ సవాజిభాయ్ దేహియా ఒక సామాన్య డిజైనర్ మాత్రమే. ఇతను 10వ తరగతి పాసై స్వయం కృషితో వినూత్న పరికరాల రూపకల్పనకు సరిక్రొత్త డిజైన్లకు శ్రీకారం చుడుతూ నిరంతరం అన్వేషిగా రూపొందారు. వీరు జామ్‌నగర్‌కు 30 కి.మీ. దూరంలో గల కలవాడ్ గ్రామ నివాసి. ఈ గ్రామంలో చాలా కిరాణా కొట్లు, కుమ్మరి షాపులు లాంటివి ఉన్నాయి.

మమ్ములను తీసుకు వెళ్ళడానికి అతను వచ్చిన మోటార్ సైకిల్ కేవలం మోటార్ సైకిల్ మాత్రమే కాదు. దీన్ని దున్నడానికి, అంతర్ వ్యవసాయానికి కూడా ఉపయోగిస్తాడు. తన చుట్టుపట్ల వారినుండి సూచనలు, సలహాలు తీసుకుంటూ ఉన్నవాటిని చిన్న చిన్న మార్పులు చేసి, తన తోటి రైతులకు ఉపయోగకరంగా ఉండేట్లు క్రొత్త క్రొత్త పరికరాల రూపకల్పన చేయడం ఇతని రోజువారి జీవితంలో ఒక భాగం. ఒక చిన్న సర్క్యూట్‌తో బల్బు, దానిలో యజమాని పేరు ఇలాంటి పరికరాలు, మొక్కలపై బెరడును, గింజలపై పొట్టును తొలగించే పరికరాలు, ఇనుమును కత్తిరించేందుకు, నీటిని ఎత్తి పోసేందుకు, పిండిమర, వివిధ పనులకు ఉపయోగించే బహుముఖ ప్రయోజనకారియైన పంపు మొదలగు పరికరాలతో ఆయన ఇల్లంతా నిండి ఉంటుంది. 57 సంవత్సరాల ఇతని జీవితం అనేక సరిక్రొత్త ఆలోచనలతో నిండి ఉంటుంది. వ్యర్థంలో అర్థం వెతికే అనేక పరికరాలు ఇక్కడ కన్పిస్తాయి. 20, 30 సంవత్సరాల నాటినుండి అధునాతనం వరకు అతను రూపొందించిన వివిధ పరికరాలు ఇక్కడ మనకు దర్శనమిస్తాయి.

వ్యవసాయ పరికరాలను మేము చూస్తూ ఉండగానే మాకొరకు టీ తయారు చేస్తున్న అతని భార్య జయాబెన్ మధ్యలో కల్పించుకుని బచ్చు భాయ్‌కి తెల్సిన వ్యవసాయం గూర్చి తనకు తెల్సినంత వరకు చెపుతానని, వ్యవసాయం మొదలు పెట్టినప్పుడు ఈయనకు తెల్సింది అంతంత మాత్రమే అంటూ 32 సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని వీళ్ళు ఇక్కడికి వచ్చినప్పుడు బచ్చుభాయ్ అరుదుగా పొలానికి వెళ్ళేవాడు. ఆవిడ కష్టపడి పొలంలో పని చేస్తూ ఉంటే అతను గట్టున పాకలో కూర్చొని రకరకాల ప్రయోగాలు చేస్తూ ఉండేవాడు. కాలం వృథా చేయకుండా తన తమ్ముళ్ళలాగా ఏదైనా ఉద్యోగం చూసుకోమని బచ్చుభాయ్‌కి చెబుతూ ఉండేదాన్ని. వాళ్ళ నాన్న బ్రతికుంటే చూసి ఇప్పుడెంతో సంతోషించేవాడు. ఆ చిన్న ఊళ్ళో బచ్చుభాయ్‌ని మేధావిగా మెచ్చుకుంటారు. పట్టు వదలని విక్రమార్కుడిలా అనేక నూతన విషయాలు కనిపెట్టే వాడుగా కొనియాడుతారు. అతను నివాసముండే ఇంటికి, వర్క్‌షాప్‌కి పనికిరాని వస్తువులు పడేసే షెడ్‌కు మధ్య అడ్డుగోడలు లేవు. అతను తన అనుభవాలను వివరిస్తూ ఉంటే అతని నిరాడంబరత, తనలోని అణకువ, నమ్రత ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. తనను తాను పొగడుకోవడం లాంటివి మచ్చుకైనా కానరావు. అపజయాలను కప్పి పుచ్చుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నించేవాడు కాదు.

బచ్చుభాయ్ తల్లి రోస్ట్ చేయడానికి నిప్పులు చేస్తుండగా భార్య మొక్కల పైపొరను




Childhood friends


Oh! my broken windmill



తీస్తూ ఉండడం ఒక వింతగా తోచింది. ఆమె ఉపయోగిస్తున్న ఇనుప దువ్వెనలాంటి దాన్ని ఇంతకు మునుపు ఎప్పుడూ చూడలేదు. కాని, అది ఎంతో సమర్థవంతంగా పని చేస్తుంది. అందుకే జయాబెన్‌తో పరాచికంగా అన్నాం. ఎప్పుడూ బచ్చుభాయ్‌పై అభియోగాలు చేయవద్దని ఎందుకంటే ఆయన తనకు కూడా సులువైన కొన్ని పరికరాలు తయారు చేసాడు కాబట్టి.

మాకు ఫలహారం ఇచ్చిన తరువాత ఆయన తల్లి దహిబెన్ విశ్రాంతిగా ఊయలలో ఊగుతూ కూర్చొంది. 90 సంవత్సరాల ఆమె విజ్ఞానమంతా చిరు నవ్వు మోముపై కన్పించింది. బచ్చు భాయ్ గురించి, తండ్రి చనిపోయిన తరువాత అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందో వివరించసాగింది. అందరిలోకి పెద్దవాడైన బచ్చుభాయ్ వాళ్ళ జీవనోపాధి అయిన వ్యవసాయం పట్ల అనురక్తిగాని, శ్రద్ధకాని కనబరిచేవాడు కాదు. తన తోటి వాళ్ళకు భిన్నంగా ఎలక్ట్రానిక్ పరికరాల పట్ల, ఇతర యంత్ర పరికరాల పట్ల ఎక్కువ శ్రద్ధ కనబరిచేవాడు. ఎప్పుడైనా తండ్రితో పొలానికి వెళ్తే అక్కడి తడి మట్టితో రకరకాల పరికరాలు తయారు చేసేవాడు. దహిబెన్ అనుకునేది 'వీడు పుట్టినప్పుడు ఒక నెలపాటు ఆపు లేకుండా ఏడుస్త అరుస్తూ వుండేవాడు. బహుశా ఏదైనా ఆరోగ్య సంబంధమైన సమస్యేమో' అని, తల్లి అతనిని పొగడుతూ ఉంటే వంటింటిలో నుంచి భార్య అంటుంది. 'గతంలో తన భర్త చేస్తున్న ప్రయోగాలపై తనకు ఏమాత్రం నమ్మకం ఉండేది కాదు. డబ్బంతా వృధాగా తగలేస్తున్నాడని ఎప్పుడూ ఏదో ఒక పనికిరాని పని చేస్తూ ఉంటాడని' అనుకునేదాన్ని.

బచ్చుభాయ్ తల్లి గత స్మృతులు నెమరు వేసుకుంటూ 1996లో కరువు సంభవించినపుడు భూగర్భంలో దాచిన 20 సంవత్సరాల నాటి జొన్నలతో బ్రతుకు వెళ్ళతీయగలిగాం అన్నది.

## ఒకే యంత్రంలో నాలుగు సదుపాయాలు

ఈ పరికరం ఒకదానిలో నాలుగు సదుపాయాలు గలది. ఇది ఒక జనరేటర్, నీటిని ఎత్తిపోసే పంపు, పిండిమర, ఇనుప వస్తువులను కత్తిరించే మెషిన్ అనే నాల్గు పరికరాల సముదాయం. ఇది మూడు హార్స్‌పవర్ ఇంజన్‌తో పని చేస్తుంది. ఉపయోగించే దాన్ని బట్టి నెలకు సుమారు 1.5 లీ. డీజిల్ ఖర్చు అవుతుంది. ఇంజను రూ. 8,000/-లు, పిండిమర మరో 2,000/-లు అయ్యింది.



## విత్తనాలు విత్తే సాధారణ పరికరం :



ఇది సమాన దూరంలో రంధ్రాలు కలిగిన ఒక గుండ్రని పి.వి.సి. రబ్బరు ట్యూబు, విత్తనాలు ఆ పి.వి.సి. ట్యూబ్‌లో వేయాలి. ఈ పి.వి.సి. ట్యూబ్‌కు రెండు వైపుల ఇనుప చక్రాలు లాంటివి పెట్టి పి.వి.సి. క్యాప్స్‌తో సీల్ చేయాలి. ఒక 'యు' ఆకారంలోని ఇనుప కమ్మిని దానికి బిగించి, ఆ ఇనుప కమ్మితో లాగుతూ పొలంలో పి.వి.సి. ట్యూబ్‌ను దొర్లించాలి. రంధ్రాల లోంచి గింజలు వరుసలలో ఆ పొలంలో విత్త బడుతాయి. చిన్న గింజలకు చిన్న రంధ్రాలు, పెద్ద గింజలకు పెద్ద రంధ్రాలతో రెండు రకాల పరికరాలు తయారు చేయడం జరిగింది.

## ప్రేలుడు కొరకు విద్యుత్ సర్క్యూట్ :

30 సంవత్సరాల క్రితం రూ. 700/-లతో ఒక విద్యుత్ సర్క్యూట్‌ను తయారు చేసాడు. 500 వోల్టుల విద్యుత్‌తో ఇది డైనమైట్‌లను పేల్చి రాతి పొరలను పగులగొట్టి బావులు త్రవ్వడానికి ఉపయోగపడుతుంది.



## నీ స్వంతం అనుకునే బల్బు :

బచ్చుభాయ్ తయారు చేసిన ఈ సరిక్రొత్త బల్బు ఒక చిన్న సర్క్యూట్ ప్రవేశ పెట్టడం మూలంగా దీని జీవితకాలం సాధారణ బల్బుకన్న అనేక రెట్లు ఎక్కువ కాలం మన్నేట్లు పొడిగించబడింది. కాంతిలో కొద్దిపాటి కంపనలు ఉండటం మూలంగా ఈ బల్బులు ఇంటి అవసరాలకన్న పొలాలలో బాగా ఉపయోగ పడతాయి. గత 20 సంవత్సరాలుగా ఈ బల్బులు తయారు చేసి విక్రయిస్తున్నాడు. తరచు ఈ



బల్బులు దొంగతనానికి గురి అవుతుండడంతో దీనికి ఒక పరిష్కారం కొరకు మన పేరు ఉన్న ఒక చిన్న చీటిని ఈ బల్బులో ప్రవేశ పెట్టే విధానాన్ని రూపొందించాడు.

ఈ చీటి కాలదు. కాకపోతే కొంత కాలానికి అక్షరాలు మసకబారి పోతాయి. తక్కువ ధరకు మార్కెట్‌లో లభ్యమయ్యే బల్బులు కొని ఈ మార్పులు చేసి ఒక్కొక్క బల్బు రూ. 15/-ల చొప్పున అమ్మేవాడు. పెద్దపెద్ద కంపెనీల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒక సామాన్య గ్రామీణ శాస్త్రవేత్త సొంతం చేసుకుని చిన్న, చిన్న మార్పులతో సరిక్రొత్త బల్బుకు రూపకల్పన చేసాడు.

**ఎలక్ట్రిక్ టెస్టర్ :**

వైర్లను తాకకుండా విద్యుత్ ప్రవాహాన్ని పరీక్షించడానికి ఈ టెస్టర్ పని చేస్తుంది. సుమారు అంగుళం లోతున వైర్ లోపల వున్న విద్యుత్‌ను కూడా దీని ద్వారా పరీక్షించవచ్చు. విద్యుత్‌ను పరీక్షించేటప్పుడు ఈ టెస్టర్ లో చిన్న బల్బు వెలగడమే కాకుండా చిన్న అలారం కూడా మ్రోగుతుంది. 5 సం.ల క్రితం దీన్ని రూపొందించాడు. వైర్లు ఎక్కడైనా తెగి ఉన్నప్పుడు గుర్తించడానికి ఇది బాగా పని చేస్తుంది.



**లోహపు దువ్వెన :**

రాజ్‌కోట్‌లో చూసిన ఒక దువ్వెనకు ప్రతిరూపం తను ఒక లోహపు దువ్వెన తయారు చేయాలి అనే సంకల్పం కల్గింది. ఇది చెట్లపై వున్న పట్టను తొలగించడానికి ఉపయోగపడే ఒక లోహపు దువ్వెన.



**వెనుక చక్రాలతో దున్నే మోటార్ సైకిల్ :**

సుజుకి మ్యాక్స్-100 మోటార్ సైకిల్ ను ఉపయోగించి2004లో ఒక బహుళ ప్రయోజనకారియైన పరికరాన్ని రూపొందించాడు. వ్యవసాయ పనులలో సౌలభ్యం కొరకు మరియు పొలంలో తిరిగేటప్పుడు స్థిరత్వానికి మోటార్ సైకిల్ వెనుక చక్రం తొలగించి, స్కూటర్ చక్రాలు బిగించాడు. పొలంలో నడిపేటప్పుడు మాటి మాటికి కాళ్ళు క్రింద పెట్టవలసిన అవసరం లేకుండా చక్కగా బ్యాలెన్స్ చేసుకోవ డానికి మోటార్ సైకిల్ వెనుక వైపు రెండు చిన్న చక్రాలు బిగించాడు. మోటార్ సైకిల్‌లో ఈ చిన్న చిన్న మార్పులు చేయడానికి సుమారు రూ. 4,000/-లు ఖర్చయింది.



**సైకిల్‌తో ధాన్యం నూర్పిడి**

పశ్చిమ బెంగాల్ లోని బాలక్డి గ్రామవాసి శ్రీ ధరిందర్ మహతో సుమారు రూ. 500/-లతో ఒక వినూత్న ధాన్యం నూర్చే పరికరాన్ని రూపొందించారు. ఇది సాధారణ ధాన్య నూర్పిడి యంత్రానికన్నా 5వ వంతు ఖర్చుతో రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యంతో (రోజుకు ఒక వ్యక్తి 1000 - 1200 కి.గ్రా. ధాన్యాన్ని నూర్పిడి చేయవచ్చు) పని చేస్తుంది. ఒక పాఠశాల సమావేశంలో వీరిని సన్మానించడం కూడా జరిగింది. ఇతనికి జరిగిన సన్మానానికి లభించిన గుర్తింపుకు, తన ప్రయత్నాలను, కష్టాన్ని జన బాహుళ్యం గుర్తించి, అభినందించినందుకు మహతో ఎంతో సంతోషించారు. చుట్టుప్రక్కల వారు ఉపయోగించి వాటి ఫలితాన్ని తెల్సుకున్న తరువాత కొనే విధంగా మరో మూడు పరికరాలు రూపొందించేందుకు తగు ఆర్థిక సాయాన్ని అందించేందుకు జాతీయ పరిశోధనా సంస్థ (నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఎన్.ఐ.ఎఫ్.) వారు ముందుకు వచ్చినపుడు మహతో ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా మహతో ఇలా అన్నారు. "ఈ పరికరం ఇంత అద్భుతమైనదని నేను గుర్తించలేదు. కేవలం నా సమస్య పరిష్కారానికే



దీన్ని రూపొందించుకున్నాను. నేను ఈ సరిక్రొత్త పరికరాన్ని రూపొందించానే గాని, దీనికి ఒక పేరుగాని, ఒక బ్రాండ్‌ను గాని కనుగొనలేదు. సూచించలేదు.

మరుసటి రోజే ఎన్.ఐ.ఎఫ్. వారు మరో మూడు ధాన్యం నూర్పిడి పరికరాలను తయారు చేయడానికి అవసరమయ్యే ఆర్థిక సహాయాన్ని స్థానిక ఉపాధ్యాయుని ద్వారా మహతోకు పంపడం జరిగింది.

మహతో కాకతాళీయంగా చేసిన ఓ చిన్న ప్రయత్నం ఎంతో మంది సన్నకారు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నది.

**ఒక్కవ్రేలితో ఉపయోగించే కలం (సింగిల్ ఫింగర్ పెన్)**

బంకురా గ్రామంలో మేమొక పరిశోధకుని కల్సుకున్నాం. జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) వారు వార్తా పత్రికలలో

(మిగతా 27వ పేజిలో)

# విశాఖ జిల్లాలో
# 21వ శోధయాత్ర విశేషాలు



**మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి సానబెడితే ఎలా రాణిస్తాయో, ఆ విధంగా మారుమూల గ్రామాలలో, కొండ కోనలలో వినూత్న పరిశోధనలు చేసి వివిధ నూతన విషయాలకు రూపకల్పన చేస్తున్న వారిని శోధించి, వారికి విస్తృత ప్రచారం యివ్వాలి. వారి పరిశోధనలు జాతి ప్రగతికి వినూత్న మార్గాలు చూపాలన్నదే ఈ 'శోధయాత్ర' ఉద్దేశ్యం. 2008 జూన్ నెల 2వ తేది నుండి 8వ తేది వరకు 'సృష్టి', 'హనీబీఏపి' వారి ఆధ్వర్యంలో జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) మరియు టి.ఇ.ఆర్.డి.ఎస్., సమత, ఆదివాసి మిత్ర మొదలగు స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో విశాఖ పట్నం జిల్లాలోని 'బొర్రా' గ్రామం వద్ద ప్రారంభమై పెద్ద గరువు గ్రామంలో ముగిసిన ఈ 'శోధయాత్ర'కు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ శ్రీ అనిల్ గుప్త గారు నాయకత్వం వహించారు. వివిధ వర్గాలకు చెందిన సుమారు 70 మంది 6 రోజుల పాటు దాదాపు వంద కిలోమీటర్ల దూరం ఈ శోధయాత్రలో పాల్గొనడం జరిగింది. వీరిలో ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ఒరిస్సా, జమ్మూకాశ్మీర్, పశ్చిమ బెంగాల్, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన రైతులు, పరిశోధకులు, విద్యార్థులు, మేధావులు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన కార్యకర్తలే కాక యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఫ్రాన్స్ దేశీయులు కూడా ఈ శోధయత్రలో పాల్గొని ఒకరి భావాలను మరొకరు పాలు పంచుకుంటూ జ్ఞాన సముపార్జనకు నాంది పలికారు.**

ఈ ప్రాంతం ఆర్థికంగా వెనుకబడిన వివిధ గిరిజన, ఆదివాసి తెగలకు చెందిన పేద వర్గాలకు ఆవాసమైనప్పటికి ఇక్కడ అపార జ్ఞాన సంపదకు కొదువలేదు. కాని, వీరి జ్ఞానం బూడిదలో పోసిన పన్నీరై అణగారిన బడుగు బలహీన వర్గాలుగా, క్లేశాలకు ఆలవాలమై అసంతృప్తితో రగిలే జ్వాలలతో వీరు జీవనం సాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, సామాజిక అసమానతల మూలంగా ఇక్కడ నక్సలైట్ ఉద్యమం బలంగా వేళ్ళూనుకొని ఉంది అనడంలో ఆశ్చర్యం లేదు. మైనింగ్ పరిశ్రమ, ఇక్కడ లభ్యమయ్యే వివిధ ఖనిజాలను దోచుకోవడమే కాని, ఈ గిరిపుత్రులకు ఇందులో ఇసుమంత అయినా భాగస్వామ్యం లేదు.

ఇక్కడ లభ్యమయ్యే రకరకాల ఖనిజాలను త్రవ్వి తీసి వ్యాపారం చేసేందుకు,





సమత, ఆదివాసి మిత్ర లాంటి వివిధ సంస్థలు ప్రత్యేకించి, కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించిన బ్రిగేడియర్ గణేశం గారి కృషి అభినందనీయం. ఈ యాత్రలో భాగస్వాములైన వివిధ సంస్థలు ఇలాంటి కార్యక్రమం మొట్టమొదటి సారిగా నిర్వహించడం మూలంగా సాధారణంగా చిన్న చిన్న పొరపాట్లు జరిగినప్పటికీ, చక్కగా జరిగింది. హనీబీయొక్క ధ్యేయాన్ని సరిగ్గా అర్థం చేసుకుని చక్కటి సహకారం అందించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదములు. నిరంతరం సహకారం అందించిన శ్రీ చిట్టిబాబు, శెట్టి నాగేశ్వర్, కొయిన, టి.ఇ.ఆర్.డి.ఎస్., వసంత కుమార్, ఆదివాసి మిత్రలకు ప్రత్యేక ధన్యవాదములు. హైదరాబాద్‌లోని తర్క శాస్త్ర విభాగాధిపతి శ్రీ రాజేశ్వర రావు గారు అందించిన సహాయానికిసర్వదా కృతజ్ఞులం. అనేక సమస్యలు ఎదురైనప్పటికి, పవన్, శ్రీనివాస్, సుధాకర్‌ల సహకారంతో జయేంద్ర, భరత్ అందించిన సేవలు కొనయాడదగినవి.

ప్రకృతి వనరులను ఉపయోగించు కునేందుకు ఇక్కడి గిరి పుత్రుల ప్రమేయం, భాగస్వామ్యం లేకుండా వివిధ ప్రైవేట్ కార్పోరేషన్లకు అప్పజెప్పాలి అనే ప్రభుత్వ నిర్ణయాన్ని సమత, టి.ఇ.ఆర్.డి.ఎస్. లాంటి సాంఘిక సేవా సంస్థలు కోర్టులను ఆశ్రయించి స్టే తీసుకు రావడం జరిగింది. ఈ ప్రాంతం పనస తోటలతో, పుష్టికరమైన జొన్న, సజ్జలాంటి మెట్ట పంటలతో, అద్దకం మొదలగు పరిశ్రమలలో ఉపయోగించే రంగులు తయారు చేసే రకరకాల మొక్కలతో వివిధ మొండి వ్యాధులను సైతం పారద్రోలే మూలికా సంబంధమైన వృక్ష సంపదతో అలరారుతూ, ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి ఈ అటవీ సంపదలను చేరవేసుకుంటూ అలాగే అక్కడి వారు తయారు చేసే వస్తువులను విక్రయిస్తూ పారిశ్రామికంగా స్థిరపడుతున్నారు. డిసెంబర్ మాసంలో ఐ.ఐ.ఎమ్.ఎ. వారు సంవత్సరానికి ఒకసారి నిర్వహించే 'సాత్విక్' అనే ఉత్సవాలలో అక్కడి ఆదివాసి తెగలను పిలిపించి వారి సాంప్రదాయక వంటలను అందరికి అందించేందుకు, రుచి చూపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ప్రొఫెసర్ గుప్త గారు వివిధ గ్రామాలలో తన పర్యటనలలో చేసే ప్రసంగాల్లో ఈ శోధయాత్ర యొక్క ఉద్దేశ్యాన్ని వివరిస్తూ ఇక్కడి సాంప్రదాయక జ్ఞాన సంపద నశించిపోకుండా భావి తరాల కొరకు అక్షర రూపంలో నిక్షిప్తం చేయవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. ఆయా గ్రామాలలో పెద్దలకు గాని, అధ్యాపకులకు గాని రిజిష్టర్లు యిచ్చి అక్కడి సాంప్రదాయ విజ్ఞాన విషయాలను అందులో పొందుపరచి ప్రతి గ్రామంలో ఒక 'విజ్ఞాన ఖని' రిజిష్టర్‌ను నిర్వహించవలసిందిగా కోరడమైనది. కొన్ని గ్రామాలలో పాఠశాలలకు గ్లోబ్, రిజిష్టరు కలిగిన కిట్స్‌ను అందించడం జరిగింది. అక్కడి పరిశోధనలకు సంబంధించిన వివిధ పోస్టర్ల ప్రదర్శన, అలాగే సాయంత్రం వేళల్లో పరిశోధనలకు సంబంధించిన వీడియో ఫిలింలను ప్రదర్శించడం జరిగేవి. యాత్ర పొడవునా టి.ఇ. ఆర్.డి.ఎస్., వైజాగ్‌కు చెందిన శ్రీ చిట్టిబాబు గారితో కలిసి ఆంధ్రప్రదేశ్ హనీబీ కోఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం గారు జనానికి అన్ని విషయాలను తెలుగులో విశదీకరించేవారు.

ఈ శోధయాత్ర విజయవంతం కావడం వెనుక టి.ఇ.ఆర్.డి.ఎస్.,



# అరకులోయలో జరిగిన 21వ శోధయాత్రలో సత్కరింపబడిన గ్రామ జ్ఞానవేత్తలు

| గ్రామం | జ్ఞానవేత్త | జ్ఞానం |
|---|---|---|
| బొర్రా | **ద్వారపూడి** | |
| | **అప్పలనాయుడు** | మూలికా వైద్యులు |
| సీసగూడ | **సారాసంప** | శతాధిక వృద్ధులు |
| | **సారా సుందర్** | శతాధిక వృద్ధులు |
| మూల్యగూడ | **సిర్గం రఘు** | మూలికా వైద్యులు |
| మెడపర్తి | **వంతల బుద్ధు** | మూలికా వైద్యులు |
| | **సుగుర్ గంగమ్మ** | వంట పోటీలు-ప్రథమ |
| | **సిగర్ బ్రమ్మ** | జానపద గీతం |
| పెద్దబయలు | **బోయన సన్యాసిన్** | మూలికా వైద్యులు |
| | **జ్యోతి వర్రబోయిన** | యంత్రశక్తితో పనిచేసే స్టౌవ్ |
| బొడ్డపాడు | **కొర్రా బాలరాజు** | మూలికా వైద్యులు |
| | **కొర్రా మిన్నన** | మూలికా వైద్యులు |
| | **గిమ్మెల పెంటారావు** | మూలికావైద్యులు |
| | **సెంబి భీమమ్మ** | మూలికా వైద్యులు |
| | **మామ్డి వెంకట్** | బి.డి. కాంపిటీషన్ |
| | **కొర్రా గోపాలరావు** | బి.డి. కాంపిటీషన్ |
| | **కొర్రా శ్రీను** | బి.డి. కాంపిటీషన్ |
| | **మామ్డి రోజా** | బి.డి. కాంపిటీషన్ |
| | **కొర్రా సేమాంచలం** | బి.డి. కాంపిటీషన్ |
| | **వంటల్ల లక్ష్మి** | బి.డి. కాంపిటీషన్ |
| వల్సి | **సిర్గం సన్యాసినాయుడు** | మూలికా వైద్యులు |
| | **సుధారాణి** | ఐడియా పోటీ |
| | **పవన్ కుమార్** | ఐడియా పోటీ |
| | **కొండా బాబు** | ఐడియా పోటీ |
| | **విజయ్ కుమార్** | ఐడియా పోటీ |
| | **పద్మ** | ఐడియా పోటీ |
| రాళ్ళవలస | **సాంటె పండన్న** | మూలికావైద్యులు |
| | **వెదురు కొమ్ములు** | వంటలపోటీ-ప్రథమ |
| | **జన్నె రాములమ్మ** | వంటలపోటీ-ద్వితీయ |
| | **సుంపె చిన్నప్ప** | |
| | **బోయిని గంగమ్మ** | వంటలపోటీ -తృతీయ |
| | **సాంబె గంగమ్మ** | |
| మజ్జివలస | **కెరంగి బుద్ధు** | మూలికా వైద్యులు |
| | **పంగె గురు** | మూలికా వైద్యులు |
| | **రామరాజు &** | రాష్ట్రస్థాయి |
| | **రామకృష్ణ** | వాలీబాల్ క్రీడాకారులు |
| బూర్జ | **చట్టు లచ్చన్న** | మూలికా వైద్యులు |
| | **బిమ్రి లైకన్** | మూలికా వైద్యులు |
| | **డి. ఈశ్వరమ్మ** | తోటకూర వంటకు ప్రథమ |
| | **సి.హెచ్. కన్నమ్మ,** | గుమ్మడి వంటకు ద్వితీయ |
| | **నాని మామిళ్ళమ్మ,** | వెజిటబుల్ సాస్ - తృతీయ |
| బర్రింగ్ | **సమర్ చిన్నయ** | మూలికా వైద్యులు |
| బందర్ | **రాధికా అమ్మ** | పరస్పర భావ వ్యక్తీకరణ |
| | **ఎస్. అప్పలరాజు** | బి.డి. కాంపిటీషన్-ప్రథమ |
| | **సిహ్మాద్రి ఇందిర** | బి.డి. కాంపిటీషన్-ద్వితీయ |
| కిండంగిగూడ | **సర్బా లక్ష్మన్** | మూలికా వైద్యులు |
| కొత్తవలస | **పండన్న,** | మూలికా వైద్యులు |
| | **అరవింద్ మరియు** | |
| | **ఈశ్వర్** | బి.డి. కాంపిటీషన్-ప్రథమ |
| | **జె.సిమ్మాద్రి** | బి.డి. కాంపిటీషన్-ద్వితీయ |
| కోడిపుంజుల | **జయరామచంద్ర** | మూలికా వైద్యులు |
| వలస | **జ్యోతి** | బి.డి. కాంపిటీషన్-ప్రథమ |
| దుంబ్రిగూడ | **సెట్టి కనకయ్య** | మూలికా వైద్యులు |
| పనసపట్టు | **ముత్తాల్ ముత్తి** | మూలికా వైద్యులు |
| | **సావిత్రి &** | |
| | **మటన్ మితుల** | వంటల పోటీలు |
| టిటింగ్ వలస | **సామారెడ్డి జిన్ను** | మూలికా వైద్యులు |
| | **కిల్లో లొచ్చు** | మూలికా వైద్యులు |

**బి.డి. కాంపిటీషన్ :** బయో డైవర్సిటీ పోటీ



# నేను శోధించిన శోధయాత్ర



**హైదరాబాద్‌కు చెందిన కుమారి వాణి రూపేల వృత్తిపరంగా 'స్పీచ్ థెరపిస్ట్'. సమాజంపై వున్న ఆసక్తి, పరోపకార భావం, జ్ఞానోపార్జన చేయాలన్న ఉత్సాహం ఆమెను శోధయాత్ర వైపు మళ్ళించింది. ఆమె చూపుల్లో, ఆమె భావాల్లో అరకులోయలో జరిగిన శోధయాత్ర గురించి....**

**- వాణి రూపేలా, హైదరాబాద్**

సుమారు 6 సంవత్సరాల క్రితం మా తండ్రి 2001, డిసెంబర్‌లో రాజస్థాన్ లోని ఆల్వార్‌లో జరిగిన శోధయాత్రకు వెళ్ళినపుడు మొట్టమొదటి సారిగా ప్రొఫెసర్ అనిల్ గుప్తా గురించి, శోధయాత్ర గురించి విన్నాను. తరువాత కొంత కాలానికి గుప్తా సుమారు రెండు గంటలు మా ఇంటి వద్ద గడిపినపుడు వారిని ఒక సంపూర్ణ వ్యక్తిగా గుర్తించాను. 'రీడర్స్ డైజెస్ట్' నవంబర్ 2007 సంచికలో ముద్రితమైన జమ్ము శోధయాత్ర అనే వ్యాసం. ఈసారి ఈ శోధయాత్రలో తప్పక పాల్గొనాలి అనే నా కోరిక రెట్టింపయింది. ఈసారి శోధయాత్ర ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహింప నున్నందున తప్పక పాల్గొనమని అనిల్ అంకుల్ నన్ను ప్రోత్సహించారు. హనీబీ కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశంతో సంప్రదిస్తూ ఉత్సాహ భరితమైన ఈ యాత్రా విశేషాలు తెల్సుకున్నాను. ఈ యాత్రలో సుమారు 50 మంది పాల్గొంటారని, 2008 జూన్ 2-8 తేదీల మధ్య దాదాపు 30 గ్రామాల గుండా సుమారు 100 కి.మీ. సాగుతుంది. ఇంటర్‌నెట్ సౌకర్యాలు బొత్తిగాలేని, అతి తక్కువ ఫోన్ సౌకర్యం గల ప్రాంతాలలో ఈ యాత్ర సాగుతోంది. నాకు టికెట్ రిజర్వేషన్ చేయించుకున్న తరువాత మాఅమ్మ కూడా నాతో రావడానికి నిర్ణయించుకుంది. అదృష్టవశాత్తు ఆమెకు కూడా రిజర్వేషన్ దొరికింది.

ఈ యాత్ర వివరాలు తెలియజేసే ముందు యాత్రలో పాల్గొనే సంస్థలు, వాటి కార్యకలాపాల గూర్చి సాధారణ సమీక్ష చేస్తాను. "సృష్టి" - ఎస్.ఆర్.ఎస్.ఐ.టి.ఐ. (సుస్థిర సాంకేతిక నిపుణత, సంస్థల పరిశోధనా సమాఖ్య) స్థానిక సమస్యలకు పర్యావరణ సహిత పరిష్కారాలు సూచిస్తూ మారుమూల పల్లెల్లో సాధారణ సామాజికులలో ఉన్న పరిశోధకులను, వినూత్న విషయాలు కనుగొనే వారిని వెలికి తీసే ఒక ప్రభుత్వేతర సంస్థ. ప్రకృతి సిద్ధంగా ఒక చక్కని ఇంజనీర్లుగా పేరుగాంచిన 'హనీబీ' పేరుతో వ్యవహరించే సంస్థకు సృష్టి చేయు వివిధ రకాల పుష్పాల నుండి పుప్పొడిని సేకరించి తద్వారా భిన్న జాతి మొక్కలకు సంబంధించిన విషయాలకు విస్తృత ప్రచారం కల్పించడమే ఈ 'హనీబీ' సంస్థ ముఖ్యోద్దేశ్యము. అలాగే సమాజంలోని ఔత్సాహికులకు, పరిశోధకులకు, జిజ్ఞాసులకు విస్తృత ప్రాచుర్యం కల్పించి, వారి జ్ఞానాన్ని పదిమందికి పంచేందుకు అవకాశం కల్పించడం ఈ సంస్థ మరో కార్యం. ఈ సృష్టి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) మరియు గ్రాస్‌రూట్స్ ఇన్నోవే షన్స్ ఆగ్మెంటేషన్



**ఇంధనాన్ని ఆదా చేసే పొయ్యితో ఆదివాసి జ్యోతి**



నెట్‌వర్క్ (జి.ఐ.ఎ.ఎన్.) అనే సంస్థల పోషణలో కూడివుంది ఈ 'శోధయాత్ర' అనగా పరిశోధనా ప్రయాణం. సృష్టి ఉద్దేశ్యానికి రూపకల్పనే ఈ సుహృద్భావ యాత్రలో క్రింది స్థాయిలో ఉన్న పరిశోధకులను, పరిశోధనలను వెలికి తీయడాని కి, జ్ఞానాన్ని పంచుకోవడానికి ఉపయోగ పడేదిగా పేర్కొంటా రు. భారత దేశంలో సంవత్సరం లో రెండు, మూడు పర్యాయాలు ఈ యాత్ర నిర్వహింపబడుతోంది. దీనిని గురించి వెబ్‌సైట్ ద్వారా మరింత తెలుసుకుని, నా మొట్టమొదటి యాత్ర అనుభవాలను మీతో పంచుకుంటాను.

**యాత్ర ఆరంభం :**

బట్టలు, పడుకోవడానికి అనువైన సకల సౌకర్యాలతో మే 31వ తేదీన విశాఖ పట్టణానికి మా యాత్ర ప్రారంభమైంది. అక్కడ మా బంధువులతో కొద్దిసేపు గడిపి, ఎన్.ఐ.ఎఫ్.కు చెందిన బ్రిగేడియర్ గణేశం, డాక్టర్ నితిన్‌లతో కలసి బస్టాండుకు వెళ్ళాం. అక్కడ మరికొంతమంది శోధయాత్రికులను కల్సుకున్నాం. వారిలో పంత్‌నగర్, బి.జి. పంత్ యూనివర్సిటీలో కమ్యూనికేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేసే డా. కామేశ్వరి, ఇటీవల లండన్ నుంచి తిరిగి వచ్చి వ్యాపారవేత్తగా ఢిల్లీలో స్థిర నివాసం ఏర్పరచుకున్న శ్రీ అలగ్‌నటరాజన్, బెంగుళూరు నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీరామకృష్ణ, నెల్లూరు నుంచి ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ప్రోత్సహించిన ఒకే ఒక అనుభవశాలియైన శోధయాత్రికుడు శ్రీ గౌతమ్‌సింగ్, బస్సులో అరకు లోయకు బయలుదేరాం. అక్కడి నుండి జీపులో మొదటి మజిలీ అయిన 'బొర్రా'కు బయలుదేరాం. అక్కడికి మొదటగా చేరుకున్నది మేమే. మిగతా వారికోసం మేం ఎదురు చూస్తుండగా ఒక రాయికి కొట్టుకొని నా పాదానికి దెబ్బ తగిలింది. మేమింకా నడక మొదలు పెట్టక ముందే నేను తొలి దెబ్బ తగిలించుకున్నాను. గౌతమ్ అంకుల్ పసుపును నీటిలో కలిపి గాయానికి పూసి కట్టు కట్టాడు. ఆశ్చర్యంగా మరుసటి రోజుకు పూర్తిగా నొప్పి తగ్గిపోయి నేను మామూలుగా అయిపోయాను. అనేక సార్లు ఫోనులో మాట్లాడటమే గాని నేను ఎప్పుడూ చూడని బ్రిగేడియర్ గణేశం గారు రావటం ఆయనను కలవడం నాకెంతో ఆనందం కలిగించింది. ఆయన ఒక మహోన్నత వ్యక్తి మాలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరించారు. అలాగే ఈ శోధయాత్రలో పాల్గొనడానికి అమెరికా నుంచి విచ్చేసిన వినీత్, ఉదయలను కూడా కలుసుకున్నాం. వినీత్ అమెరికా నుండి తిరిగి వచ్చేసి భారతదేశంలో గ్రామీణాభివృద్ధికి, గ్రామీణుల పట్ల ఆదరణ చూపేందుకు ఇక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాడు. వినీత్ సూచన మేరకు ఉదయ్ కూడా భారతదేశం వచ్చాడు. అలాగే ఫ్రాన్స్, జర్మనీ లకు చెందిన టెలివిజన్ ఛానల్ బృందం వారు తమ సామాగ్రితో వచ్చారు. వారిలో ఫిలిప్ బ్రచట్, ఎల్సా క్లెనిచ్ ముఖ్యులు. వారు వెంటనే అరకు లోని హోటల్‌లో రాత్రి బస చేయడానికి వెళ్ళారు. మేము ఒక పాఠశాల ఆవరణలో రాత్రి భోజనానికి సిద్ధమవుతూ ప్రస్తుత వ్యవసాయ విధానం, ప్రభుత్వ విధానాలు, వివిధ పరిశోధనలను గూర్చి చర్చించడం మొదలెట్టాం. అక్కడి 'సమత' అనే స్వచ్ఛంద సంస్థ వాలంటరీలతో కలిసాం. సమత కార్యకలాపాలను గూర్చి వివరించగా మేము చాలా ఆశ్చర్యపోయాం. అలాగే ఉత్తేజితులం అయ్యాము. అరకు లోయ తూర్పు కనుమలలో ఒక భాగం. విస్తృత వృక్ష సంపద, బొర్రా గుహలు ఈ అరకును ప్రసిద్ధ యాత్రా స్థలంగా, ఆంధ్రప్రదేశ్‌ను ఆకర్షణీయంగా చేశాయి. ఈ అరకు గురించి మనకు తెల్సింది ఇంతవరకే. మనకు తెలియని విషయాలను గురించి సమతా సభ్యులు, ఎంతో వివరంగా చెప్పారు. మైనింగ్ సంస్థలు, వాటికి ప్రభుత్వ మద్దతు ఇక్కడి గిరి పుత్రులను భయభ్రాంతులకు గురి చేశాయి. బొర్రా గుహలకు విచ్చేసినప్పుడు ఇక్కడి బాక్సైట్, మైకా మొదలగు ఖనిజాలను పెద్దయెత్తున త్రవ్వకాలు నిర్వహించడానికి జరిగే ప్రయత్నా



లను తెల్సుకొని ఆశ్చర్యానికి గురయ్యారు. కాని ఆ భూమి తమది అని చెప్పుకోవడానికి అక్కడి స్థానికులకు ఎలాంటి అధికారిక పత్రాలు లేవు. తమ పూర్వీకుల నుండి తమకు సంక్రమించింది. ఇది తమది అనేందుకు ఎలాంటి ఆక్షేపణలు లేవు అని భావిస్తున్న తరుణంలో ప్రస్తుతం వ్యాపార కార్యకలాపాలకు, దురాక్రమణలకు లోనవుతుండటం, వారు దోపిడీకి గురి కావటం జరుగుతోంది. ప్రారంభంలో నక్సలైట్లు అనే భావనతో జైలులో పెట్టిన తమవారిని విడిపించుకోవటమే సరిపోయింది సమతకు. పది సంవత్సరాల నిర్విరామ పోరాటం తరువాత సుప్రీం కోర్టు 'సమత తీర్పు' అనే తీర్పు ద్వారా గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించరాదు అని తెల్పుతూ, గిరిజన భూములు వారికే పట్టాలు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించింది. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని 5వ అధికరణం ప్రకారం గిరిజన భూములను గిరిజనేతరులకు బదలాయించడం అసంబద్ధ చర్యగా పరిగణించబడును అని పేర్కొంది. ఈ 5వ అధికరణాన్ని సవాలు చేస్తూ కొన్ని పరిశ్రమలు సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేశాయి. కాని "గిరిపుత్రుల సంక్షేమమే, సమాజ సౌభాగ్యం" అనే నినాదంతో సమత తన పోరాటం కొనసాగిస్తూనే ఉంది. ఈ



ఉత్తేజపూరిత అంశం తరువాత మేము రాత్రి భోజనానికి సిద్ధమయ్యాం. కుండపోతగా వర్షం, అనంతరం వర్షం కాస్త తగ్గి చిరు జల్లులు పతుడుండగా నేను టాయిలెట్‌కు వెళ్తూ ఒక తాడులాంటి దాన్ని చూచాను. లైట్ వేసి చూడగా అది పాము. వెంటనే నేను వెనుదిరిగి వచ్చేసి నిద్రకు ఉపక్రమించాను.



**మొదటి రోజు :**

మేము అల్పాహారం తీసుకుని సమావేశ ప్రాంగణంలో గుజరాత్, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చే ప్రొఫెసర్ అనిల్ గుప్త బృందం కోసం ఎదురు చూస్తూ, గృహ అవసరాలకు ఉపయోగ పడే గ్యాస్ ప్లాంటు పరిశోధించిన బీమవరం వాసి శ్రీరామ మూర్తి గారితో మాట్లాడసాగాం. మూలికలు భద్రపరచిన ప్రాంగణంలో బొర్రాకు చెందిన మూలికా వైద్యులతో భాషను తర్జుమా చేసే వారితో తలసి ముచ్చటిస్తున్న వివేక్‌ను కలిసాం. వివేక్ మూలికా వైద్యంలో డాక్టరేట్ చేసి ఎన్.ఐ.ఎఫ్. కొరకు పని చేస్తున్నాడు. కొన్ని రోజుల తర్వాత వివేక్ గురించి తెల్సుకున్నాము. ఈ శోధయాత్ర చక్కగా నిర్వహించడానికి వివిధ రకాలుగా వివేక్ సాయపడుతున్నాడు. అలాగే ఎప్పుడూ నవ్వుతూ, చలాకీగా వుంటూ 'సృష్టి' కొరకు పని చేస్తున్న శ్రీ జయేంద్రను కల్సుకున్నాం. అలాగే గత శోధయాత్రలో పాల్గొన బెంగాల్‌కు చెందిన బి.టెక్ విద్యార్థి జయదీప్‌ను కల్సుకున్నాను. చాలా బృందాలు బస్సులలో వచ్చాయి. వారిలో మొట్టమొదటి సారిగా కోయిల్‌ను కల్సుకున్నాం. ఈవిడ జయదీప్ సహ విద్యార్థిని. ఇది ఆమెకు రెండవ శోధయాత్ర. చక్కటి గాయకురాలు, చిన్న చిన్న కుటుంబ సంబంధిత విషయాల నుంచి



బృహత్తర వ్యాపార కార్యకలాపాల వరకు గంటల తరబడి అనర్ఘళంగా మాట్లాడ గలదు. నిష్ణాతులైన ప్రొఫెసర్ గుప్త బ్రిగేడియర్, ఇతర శోధయాత్రికులతో సమావేశ ప్రాంగణానికి వచ్చారు.

భారీ వర్షం మూలంగా రైతులు, గ్రామస్తులు ఎక్కువ మంది సమావేశానికి రాలేక పోయారు. సమత వాలంటీర్లు తమ కార్యక్రమాలను గూర్చి ఉద్రేక పూరిత ఉపన్యాసం ఇచ్చారు. తెలుగులోని వారి ఉపన్యాసాన్ని ఆంగ్లానికి అనువదించారు. అప్పల నాయుడు అనే మూలికా వైద్యుడు, పరిశోధకుడిని శాలువ, ప్రశంసా పత్రంతో సన్మానించారు. అప్పల నాయుడు ఒక నడిచే, మాట్లాడే గ్రంథాలయం అని, రాబోయే తరాలకు అతని విజ్ఞానాన్ని అందించాలని ప్రొఫెసర్ గుప్త పేర్కొన్నారు. అప్పలనాయుడు గాని, ఇతర పెద్దలకు తెల్సిన ఈ మూలికా వైద్యం, వివిధ రకాల నేలలు, ఆహార పదార్థాలు మొదలగు వాటికి సంబంధించిన సంప్రదాయక విషయాలను అక్కడి పాఠశాలల పిల్లలకు తెలియజేసే ఏర్పాటు చేయవలసిందిగా ఉపాధ్యాయులకు ప్రొఫెసర్ గుప్త కోరారు. జ్ఞాన గ్రంథం (నాలెడ్జి రిజిష్టర్) ను ఇచ్చి వివరాలు అందులో పొందు పరచమన్నాం. ఆ గ్రామ సర్పంచిని జంగిల్ (అడవి), జాన్‌వర్ (జంతువు), జమీన్ (భూమి) ఈ మూడు 'జె'లు గ్రామాల జీవన విధానంలో అత్యంత ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని కాపాడాలి, భావి తరాలకు జాగ్రత్త చేయాలి. సమావేశ అనంతరం బయలుదేరి మధ్యాహ్నానికి సినుగూడ చేరుకున్నాం. మాతో కూడా ఒక ట్రక్, ఒక సుమో వాటిలో మా వస్తువులు, వంటకు అవసరమైన సామాగ్రి, పాత్రలు, జనరేటరు, కరపత్రాలు మొదలగునవి. తిన్నగా ఒక గ్రామానికి చేరుకుని నల్లని కురులతో, భర్తతో నివసించే 90 సంవత్సరాల వృద్ధురాలు శ్రీమతి సారన చంపను సన్మానించాము. ఆమె భర్తను కలవలేక పోయాం. వారే ఆ వృద్ధ దంపతుల గూర్చి జాగ్రత్త తీసుకుంటున్నామని తెలిపారు. ఆ వృద్ధురాలు తన చుట్టు చేరిన మమ్ములను చూసి సంతోషించింది. కాస్త వినికిడి లోపం వల్ల ఎక్కువ మాట్లాడలేదు. తరువాత ఇలాంటి వృద్ధులను సన్మానించడంలోని ఆంతర్యం ఏంటని ప్రొఫెసర్ గుప్తా గారిని అడిగా. అందుకు గుప్త సమాధానం ఇస్తూ పెద్దల పట్ల గౌరవం వారి శతాధిక వసంతాల అనుభవమే ఇందుకు కారణం అన్నారు. దురదృష్ట వశాత్తు సమాజం వృద్ధుల పట్ల అంత సన్నిహితంగా ఉండటం లేదని, ఇలాంటి చర్యల మూలంగా సమాజంలో యువకులకు పెద్దల పట్ల గౌరవ భావం పెరుగుతుందని అన్నారు. సుమారు 5 కి.మీ. మేము కాలి నడకన వెళ్ళాం. అమ్మ మాత్రం కొంత దూరం కారులో ప్రయాణి,చింది. మూల్యగూడ మార్గ మధ్యంలో మధ్యాహ్నాం భోజనం పూర్తి చేశాం. అక్కడ నేను, మా అమ్మ మొదటగా గుజరాత్ సోదరులు కిరణ్ భాయ్, జమీల్ భాయ్ లకు మమ్ములను పరిచయం చేసుకున్నా. నిదానంగా మిగతా వారిని కల్సి వారిని గూర్చి తెల్సుకున్నాం. భోజన విరామంలో అరుణ్‌ను కల్సుకున్నాము. అరుణ్ చాలా మాటకారి. కాని, సమంజసం కాదు అనుకున్నప్పుడు ఎంత డబ్బిచ్చినా పెదవి విప్పరు. అరుణ్ ఆతిథ్య విభాగంలో అర్హత పొంది క్యాటరింగ్‌లో స్పెషలైజేషన్ చేశాడు. ఇది అతనికి రెండవ శోధయాత్ర. నేను మాట్లాడలేక పోయిన మరో వ్యక్తి చెన్నయ్‌కి చెందిన ప్రకాష్. అతని వద్ద ఎస్.ఎల్.ఆర్. డిజిటల్ కెమెరా వుంది. మధ్యాహ్న భోజన విరామంలో తేలికైన కొయ్యతో ఒకదానిపై ఒకటి ఏర్పాటు చేసి రెండింటిని ఒక చెక్క హ్యాండిల్‌తో కలిపిన గ్రైండర్ (ఇసుర్రాయి)ని చూశాం. క్రింది భాగం వాలుగా వుండి వీటిని చిలకరిస్తూ వుంటే ధాన్యం పొట్టు వేరవుతాయి. మాతో కూడా సమావేశం జరిగే మూల్యగూడకు వచ్చే ఒక మూలికా వైద్యుని ఇంటర్వ్యూ చేయటంలో వివేక్‌కు సహకరించాను. ఇక్కడ కూడా ఎక్కువ మంది హాజరు కాలేదు. మూలికా వైద్యునికి సన్మానం అయిన తర్వాత తదుపరి గ్రామం 'మెడపర్తి'కి బయలు దేరాం. వివిధ రకాల వ్యక్తులను కలుసుకుంటూ సాగిన మా నడక చాలా సరదాగా సాగింది. అరుణ్ ఎప్పుడూ దగ్గరి దారులు చూపుతూ వుంటాడు. మేమంతా వారిని అనుసరిస్తాం.

12 కి.మీ. నడక తరువాత మెడపర్తి చేరుకున్నాం. ముందుగా అక్కడ ఆతృతగా, పరాచికాలు ఆడుకుంటూ మా రాక కోసం ఎదురు చూస్తున్న చిన్న పిల్లలను చూశాం. వెంటనే మా అమ్మ చిన్న పిల్లలతో కల్సిపోయి, వారితో కొన్ని హింది రైమ్స్ చెప్పించింది. అలాగే కొన్ని పాటలతో మమ్ములను ఆకట్టుకున్నారు. ప్రక్కనే వున్న ఒక కాలువలో స్నానాలు చేసి, రాత్రి భోజనం కానిచ్చి, గ్రామ సమావేశానికి హాజరైనాం. గ్రామస్థులకు కొన్ని వీడియో చిత్రాలు





కూడా నిర్వహించాం. నలుగురు మహిళలు ఈ పోటీలో పాల్గొన్నారు. స్థానికంగా లభ్యమయ్యే పదార్థాలతో ఎక్కువ పోషక విలువలు కలిగిన వంటల తయారీని ప్రోత్సహించడానికి ఈ పోటీలు ఎంతగానో తోడ్పడతాయి. వైద్యుని సన్మానించాం. అలాగే చక్కని హిందీ పాటలు పాడిన ఒక వృద్ధుని కూడా సన్మానించాం. వృద్ధుని గూర్చి ప్రొఫెసర్ గుప్త మాట్లాడుతూ తాతగారి మనసు ఈ వయసులో కూడా ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది అన్నారు. వేము కొంతమందిమి రాత్రి హాలులో పడుకున్నాం. మరికొంత మంది ఆరుబయట, కొంతమంది ఇళ్ళలో పడుకున్నారు. మొత్తం 55 మంది ఉన్న మా బృందంలో కామేశ్వరి, కాజల్, కలకత్తాకు చెందిన అమ్మాయి కోయల్, గుజరాత్‌లో స్థిరపడ్డ మళయాళీ సులేఖ మొదలగు ఆరుగురు అమ్మాయిలు కూడా ఉన్నారు. 25 సంవత్సరాల వయసుగల ఈ అమ్మాయి గొడవలతో దెబ్బతిన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు 'అర్జు' అనే పేరుతో ఒక ఎన్.జి.ఓ. అహమ్మదాబాద్‌లో స్థాపించి, సేవలు అందిస్తోందని తెల్సి ఆశ్చర్య పోయాను. అలాగే 'సృష్టి' సంస్థ కార్యకలాపాలలో కూడా ఈ అమ్మాయి చురుకుగా పాల్గొంటోంది.

**(వచ్చే సంచికలో మరికొన్ని విశేషాలు)**

చూపే ఏర్పాట్లు చేసేలోగా పిల్లలు మరికొన్ని రైమ్స్ చెప్పారు. లైటు పురుగుల మధ్య మా సమావేశం ఏర్పాటయింది. గ్రామస్థులకు వివిధ వీడియో చిత్రాలు చూపించాం. ఇది మా శోధయాత్రికులకు ఒక చక్కని అనుభూతిని ఇచ్చింది. ఈ చిత్రాలలో ఒక సైకిల్‌ను ఉపయోగించి చేసిన వివిధ పరిశోధనలకు చెందినవి, అలాగే శారీరక వికలాంగులకు సంబంధించినవి ఉన్నాయి. వీటిలో కొన్ని డిస్కవరీ ఛానల్ తయారు చేసినవి ఉన్నాయి. వాటిలో స్పైడర్‌మేన్‌గా పిలువబడే కేరళ వాసి అప్పాచెన్ తయారు చేసిన కొబ్బరి చెట్టు ఎక్కే సాధనం, నేలమీద, నీటిమీద నడిచే సైకిల్, కేరళకు చెందిన ఒక బాలిక రూపొందించిన సైకిల్‌తో నడిచే వాషింగ్ మిషన్, చెప్పులకు జత చేసి వాటిమీద నడిచే పురుగు మందు చల్లే స్ప్రేయర్ మొదలగునవి. ఈ చిత్రాలు చూడముచ్చటగా, చెవులకు ఇంపుగా వుంటూ ఇది నా ప్రయోగాత్మక రూపకల్పన అని పరిశోధకుని వాక్యాలతో ప్రతి చిత్రం ముగుస్తుంది. ఈ పరిశోధనకు విద్యార్హతకు ఎలాంటి సంబంధం లేదేమో అనిపిస్తుంది.

ఒక పరిశోధకుడు కావాలంటే వినూత్న భావాలు, ఉద్దేశ్యాలు వుంటే చాలునని, తగిన పెట్టుబడి, ప్రచారం ఉంటే అదే మార్కెట్‌లోకి వస్తుందని హనీబీ నమ్ముతుంది. దీనికై గ్రామ వాసులకు పూర్తి సహకారం అందిస్తుంది. మూల వనరులకు ఖరీదు కట్టి దానిని పరిగణన లోకి తీసుకుని అమ్మకం ధర నిర్ణయించి, వచ్చిన లాభాన్ని దానికి మూలమైన విజ్ఞానాన్ని అందించిన వారికి పంచాలి. వీడియో చిత్రాలు చూపడమే కాకుండా వంటల పోటీలు



# స్పందన

ఎడిటర్ గారికి,

ఖమ్మం జిల్లా భయ్యారం, గుండ్రాతి మరుగు గ్రామవాసినైన నేను పేద రైతుకూలీ కుటుంబానికి చెందిన వ్యక్తిని. 35 సంవత్సరాల క్రితం మా పెద్దలు జీవనాధానం కొరకు సికింద్రాబాద్ వచ్చారు. ఇక్కడ మోండా మార్కెట్‌లో టిఫిన్ బండి నడిపించుకుంటూ జీవనం సాగించారు. మా కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల నా చదువును 10వ తరగతి మధ్యలోనే ఆపివేయ వలసి వచ్చింది. నా తొమ్మితో తరగతిలో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశ పెట్టడంతో అందులో నాకు ఎలక్ట్రికల్స్ సబ్జెక్ట్ ఇచ్చారు. కాని, నాకు ఎలక్ట్రానిక్స్ ఎక్కువగా ఇష్టమైన సబ్జెక్ట్. అప్పుడు వృత్తి విద్యా పోటీలలో నేను చేసిన ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది. అప్పట్లో ఆ ఫొటో కొనే తాహతులేక ఒక జిరాక్స్ కాపీ తీసుకున్నాను. గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారు ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతి అందించారు. నా చదువు ఆగిపోయినా నాకు ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ మెకానిక్స్ పైన మక్కువ తగ్గలేదు. ఆ తరువాత ఒక అల్యూమినియం ఫ్యాబ్రికేటర్ వద్ద ఒక సంవత్సరం, కార్పెంటర్ వద్ద రెండు సంవత్సరములు పని చేయటం జరిగింది. కాని, ఎప్పుడూ నాకు ఇష్టమైన ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్‌పైనే నా ద్యాసంతా ఉండేది. వాటిపైనున్న ఇష్టంతో నేను కొన్ని ఎలక్ట్రానిక్స్ సంబంధించిన పుస్తకాలు చదువుతూ వైరింగ్ మరియు రిపేర్లు చేయడం మొదలు పెట్టాను. మా ఇంటి పక్కవారివి మొదట్లో రిపేరు చేసేవాడిని. అలా ఎదుగుతూ నేను టి.వి., రేడియో మెకానిక్‌గా మారటం జరిగింది. ఇప్పుడు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులైనా చాలావరకు రిపేరు చేయగలను. నా చిన్నప్పుడు నేను పడిన బాధలు మరువని కారణంగా, అలాంటి పరిస్థితి ఎవ్వరికీ రాకూడదని, వృత్తి రీత్యా నా కష్టమర్లలో ఆర్థికంగా బాగా వున్నవారి సహకారంతో 180 మంది విద్యార్థులకు యూనిఫారం, మరో 180 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇప్పించడం జరిగింది.

ఏడు సంవత్సరాల క్రితం గాలి పటాల పోటీలో 12 అడుగుల పెద్ద గాలిపటం చేశాను. ఒక గుడ్డ మరియు ఎలక్ట్రికల్ పివిసి పైపులతో మొదటిసారి చేసి ఎగురవేశాను. శిల్పారామంలో జరిగిన నేషనల్ లెవెల్ పోటీలలో మొదటి బహుమతిని అందుకున్నాను. ఆ ఉత్సాహంతో మా స్నేహితులతో కలిసి 'కోహినూర్ కైట్స్ క్లబ్'ను ప్రారంభించాము. ఆ తరువాత మూడు జాతీయ, 5 అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నాము. మేము చేసే గాలిపటాలు చాలా విభిన్నంగా ఉంటాయి.

పది సంవత్సరాల క్రితం ఒక నిమ్మకాయకు వైర్లు బిగించి 'లెడ్' వెలిగించాను. ఒక నిమ్మకాయతో చిన్న ఎల్‌సిడి చేతి గడియారాన్ని నడిపించాను. సోలార్ పవర్ మరియు బ్యాటరీతో నడిచే రిక్షా ఒకటి చేశాను. వృద్ధులకు ఉపయోగపడే 'లెడ్' చేతికర్ర తయారు చేశాను. విద్యుత్తు అవసరం లేకుండా నీరు వెదజల్లే ఫౌంటెయిన్ తయారు చేశాను. మోటార్ సైకిల్ ద్వారా చార్జింగ్ చేసుకునే వీలుగా ఒక సెల్ చార్జర్‌ను తయారు చేశాను. సముద్రపు అలలతో విద్యుత్తు మరియు మంచినీటిని తయారు చేసే కార్యక్రమం ప్రయోగ దశలో వున్నది. మీలాంటివారి సహాయ సహకారాలతో ముందుకు వెళుతున్నాను. ప్రస్తుతం అంబేద్కర్ యూనివర్సిటీలో 2వ సంవత్సరం బి.ఎస్‌సి, దూరవిద్య ద్వారా చదువుతున్నాను. నా ఆశయాలు నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాను.

– కొత్త శ్రీనివాస్ **శ్రీనివాసు**

**శ్రీనివాస్ గారికి,**

**మీరు ఈ చిన్న వయసులోనే ఏ శాస్త్రీయ విద్యా లేకుండానే ఇన్ని రకాల ఇన్నోవేషన్లను చేశారని తెలిసి మాకెంతో ఆనందం కలిగింది. మీలాంటి పునాది స్థాయి శాస్త్రవేత్తలే మన దేశ ప్రగతికి ఆధారమని మేము మనసారా నమ్ముతాం. అతి త్వరలో మీ ఐడియాలను డాక్యుమెంట్ చేసి, ఎన్.ఐ.ఎఫ్. అవార్డ్ కాంపిటీషన్‌కు పంపి, వాటి విలువను పెంచి సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా చేసే ప్రయత్నాలను త్వరలోనే ప్రారంభిస్తాం.**

## ఒక్కవ్రేలితో ఉపయోగించే కలం

(18వ పేజి తరువాయి)

ఇచ్చిన ప్రకటనల ఆధారంగా 'ఒక్క వ్రేలితో వ్రాసే కలాన్ని' రూపొందించి, తన కలంతో సహా తన పేరు నమోదును కోరుతూ ఎన్.ఐ.ఎఫ్.కు ప్రవేశ పత్రాన్ని పంపాడు శ్రీ చట్టోపాధ్యాయ. అతను మమ్ములను కలవడంతో 50 కలాలు తయారు చేసి మార్కెట్‌లో వాటికున్న గుర్తింపు తెల్సుకోవడానికి అవసరమయ్యే ఆర్థిక సాయం చేయడానికి మేమూ నిర్ణయించుకున్నాం. మార్కెట్‌లో వీటికి తగు గుర్తింపు లభించినట్లయితే వంద రెట్లు, కాదు వేయి రెట్లు ఉత్పత్తి సామర్థ్యం పెంచాలి అనుకున్నాం. ఈ వినూత్న కలం రూపొందించడం వెనుక ఉన్న విధానం చాలా సులువైనది. ఒక చిన్న రీఫిల్‌తో కూడిన కలాన్ని ఒక వ్రేలికి ధరించిన రింగుకు జత చేయ బడుతుంది. ఇది బొటన వ్రేలు లేని వికలాంగులకు ఎంతో ఉపయోగకారి. అంతే కాకుండా సాధారణ ప్రజానీకానికి కూడా ఇది టిక్ చేయడానికి, వ్రాయడానికి ఎంతో ఉపయుక్తంగా వుంటుంది. ఇలాంటి కలం సాధారణంగా మార్కెట్‌లో లభ్యం అయ్యేది కాదు.

స్థానిక ప్రజానీకానికి కనీసం చటోపాధ్యాయ పరిశోధన గూర్చి కాని, తాను రూపొందించిన ఒక వినూత్న కలం గురించి కాని, తెలియదు. 'సమకాలీన సృజనాత్మకత పట్ల మనకున్న ఉదాసీన వైఖరికి ఇది అద్దం పడుతోంది' కనీసం పరిశోధకుడు అయిన చటోపాధ్యాయ కూడా దీన్ని గురించి అంతగా మాట్లాడడు, పట్టించుకోడు. కొత్తదనాన్ని ఆహ్వానించడం మన కర్తవ్యం కదా!

## 'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడింది. తేనీటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. మూవుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయకంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజలనుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నప్పుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్ని వీరికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడి నుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయినా స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్రరూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్), ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయడం, వాటికి సిద్ధాంతాల్ని, రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. హనీబీ యంత్రాంగానికి చేయూత నందించాలి. అనుకున్నట్టయితే మీరూ మా పత్రిక వార్షిక చందా లేదా జీవత కాలపు చందాలతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచురణకై పంపండి.

### చందా వివరాలు

| | రూ. |
|---|---|
| **సంవత్సర చందా** | |
| వ్యక్తిగతంగా | 100/- |
| సంస్థ లేదా లైబ్రరీకి | 1,000/- |
| **జీవిత చందా (15 సంవత్సరాలు)** | |
| వ్యక్తిగతంగా | 1,000/- |
| సంస్థ లేదా లైబ్రరీకి | 10,000/- |

**మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కుల రూపంలో పంపవలసిన చిరునామా**

శ్రీమతి అరుణ గణేశం,
అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102 , వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

# గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

**ఈ పోటీలు ఎందుకు? :** మన సమాజంలో దాగివున్న సృజనా శక్తిని వెలుగులోకి తెచ్చి, తద్వారా గ్రామీణ ప్రజల జీవన స్థాయిని పెంచాలన్న తపనే ఈ పోటీకి మూలం.

**ఎవరు పాల్గొనవచ్చు?:** ★ వృత్తిపరంగా, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల అనుభవం లేకుండా, తమ తమ వ్యక్తిగత స్థాయిలో వినూత్న ఆవిష్కరణలు సాధించిన వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు, సమాజాలు. – మహిళలు, మహిళా సమూహాలు పాల్గొనవచ్చు. – విద్యార్థులు, యువకులు వినూత్న విషయాల్ని ఆవిష్కరించినవి పంపవచ్చు. – గ్రామాల్లోని రైతులు, వృద్ధులు, అనుభవజ్ఞులు, పంటలకు, పశువులకు, ఆరోగ్యానికి సంబంధించిన ప్రయోగ సాఫల్యం అయిన ఆలోచనలను, ప్రక్రియలు పంపవచ్చును.

ఎలాంటివి పంపవచ్చు? ★ ఆవిష్కరణలు ఉత్పత్తులను పెంచే విషయంలోను, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేవిగానూ, వ్యవసాయ పరంగా రైతులు లాభదాయకంగా ఉండే పద్ధతులూ,ఆలోచనలు ఆవిష్కరణలు ఈ పోటీకి పంపవచ్చు – ప్రకృతిలో లభించే చెట్టు ఆకులు, బెరడు, మొక్కల ద్వారా మనుష్యులకు, పశు సంతతికి, పంటలకు లాభాన్నిచ్చే ఆలోచనలు, ప్రయోగాలు పంపవచ్చు.

**ఎలాంటివి పంపవచ్చు? :** ★ వ్యక్తులు లేదా బృందాలు ఎన్ని ఎంట్రీలైనా పంపించవచ్చు. తెల్ల కాగితంమీద ఈ క్రింది వివరాలను నమోదు చేయడం అవసరం. 1. నూతన ఆవిష్కరణ విశిష్ఠత సంప్రదాయ విజ్ఞానం గురించిన వివరాలు, 2. నూతన ఆవిష్కరణకు దారితీసిన నేపథ్యం. 3. నూతన ఆవిష్కరణల్ని ఆవిష్కరించిన వ్యక్తుల నేపథ్యం. వారి విద్యార్హతలను గురించిన పూర్తి వివరాలు, వీటితోపాటు ఒక ఫొటో గ్రాఫ్, వీలైతే అదనపు సమాచారంలో కూడిన వీడియోలు.

మొక్కలకు సంబంధించిన వారాలతో కూడిన ఎంట్రీలను కూడా పంపించవచ్చు. అయితే ఈ మొక్కల ఎండు భాగాల్ని ఎండు భాగాలను నమూనాలుగా పంపిచవలసి ఉంటుంది.

| **బహుమతుల కేటగిరి** | **బహుమతి (రూపాయలు)** | | |
|---|---|---|---|
| | ప్రథమ | ద్వితీయ | తృతీయ |
| ★ తమ వృత్తులు నిర్వహించడానికి వినూత్న పద్ధతులను కనుగొన్నవారు వారి వృత్తులకు సంబంధించిన పరికరాలు, పనిముట్లు, యంత్రాలు వృత్తి సులభతరం చేసే ప్రయోగాలు కనుగొన్నవారు | ఒక లక్ష | 50 వేలు | 25 వేలు |
| ★ విద్యార్థులు | 15 వేలు | 10 వేలు | 5 వేలు |
| ★ పరిశోధనలను వెతికి వెలుగులోకి తేవడానికి అసాధారణ కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు | 25 వేలు | 10 వేలు | – |
| ★ ఔషధ మొక్కల గొప్పతనాన్ని తెలియజేసినవారు | 50 వేలు | 25 వేలు | 15 వేలు |

★ అర్హులైన ఎంట్రీలకు ప్రశంసా పత్రాలు ఇవ్వబడును. ★ అసాధారణ ఆవిష్కరణలను 'హనీబీ' మరియు అన్ని ప్రాంతీయ పత్రికల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తారు. ఎన్.ఐ.ఎఫ్. వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.

**పాల్గొనుటకు ఆఖరు తేది :** రెండు సంవత్సరాలకోసారి నిర్వహింపబడు ఈ పోటీలో పాల్గొనుటకు చివరితేది 31 డిసెంబర్ 2008. ఇప్పటివరకు ఇలాంటివి 5 పోటీలు నిర్వహింపబడినవి. ఇది ఆరవ పోటీ.

ఎంట్రీలు పంపువారు తమ పూర్తి చిరునామా వివరంగా వ్రాయాలి. అందువల్ల భవిష్యత్తులో ఉత్తర ప్రత్యుత్తరాలకు వీలవుతుంది. "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (NIF) వెబ్‌సైట్ www.nifindia.orgలో మిగతా వివరాలను పొందవచ్చును.


**ఎంట్రీలను పంపవలసిన చిరునామా :**
National Co-ordinator,
(Scouting and Documentation)
National Innovation Founation,
Satellite Complex, Bunglow No. 1,
Premchand Road, Jodhpur Tekra,
Ahmedabad - Gujarat - 380 015.

**వివరాలకు సంప్రదించండి :**
A.P. State Co-ordinator,
(Scouting and Documentation)
HONEYBEEAP, 102, Vayupuri,
Sainikpuri Post, Hyderabad - 500 094.
Ph.: 040-27118555, Mobile : 98660 01678.
E-mail : honeybeeap@gmail.com

విశాఖ జిల్లా అరకు లోయలో జరిగిన శోధయాత్రలో

# సత్కరింపబడిన పల్లె జ్ఞానవేత్తలు











